విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శనివారం 18 అక్టోబరు 2025 8 పేజీలు

పిఠాపురంలో మద్యం మాఫియా

- పట్టణంలో ఎక్కడబడితే అక్కడ బెల్ట్ దుకాణాలు
- నిద్రావస్థలో అబ్కారీ శాఖ అధికారులు

విశాలాంధ్ర - పిఠాపురం : స్థానిక శాసన సభ్యుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో మద్యం మాఫియా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నది. ఇప్పటికే మద్యం వ్యాపారులు నియోజకవర్గంలో సిండికేట్‌గా మారి బాటిల్ పై ధర రూ.10లు అదనంగా పెంచి వసూలు చేస్తున్నారు. నియోజకవర్గంలో అధిక సంఖ్యలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నా అబ్కారీ శాఖ అధికారులు నామమాత్రపు తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. ఒక ప్రక్క కూటమి ప్రభుత్వం కల్తీ మద్యం పై ఉక్కు పాదం మోపుతుంటే..పిఠాపురంలో మాత్రం మద్యం వ్యాపారులు శృతిమించి అమ్మకాలు చేస్తున్నారు. దీనిపై అధికారులకు విషయం తెలిసినా చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మద్యం ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చి కొన్ని రకాల మద్యం పై రూ.10లు ధరల్ని తగ్గించగా...మద్యం వ్యాపారులు మాత్రం ఆ మద్యాన్ని కూడా ఒక బాటిల్‌కు రూ.10లు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో చోటుచేసుకున్న నకిలీ మద్యం ఉదంతాలను అరికట్టే నిమిత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మద్యం వినియోగదారులకు నాణ్యమైన మద్యం అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా ప్రతీ మద్యం వినియోగదారుడు తాను కొనుగోలు చేసిన మద్యం అసలైనదో కాదో ఈ ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. మద్యం వినియోగదారుడు ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని దాని ద్వారా మద్యం సీసాపై ఉన్న క్యూ ఆర్ కోడ్ కలిగిన లేబుల్ పై స్కాన్ చేస్తే సదరు మద్యం బాటిల్ ఎక్కడ తయారైనది, తయారీ తేదీ, బ్యాచ్ నెంబర్, ఏ మద్యం డిపో నుంచి సరఫరా అయ్యింది, ఏ మద్యం షాపుకి సరఫరా అయ్యింది వంటి విషయాలను తెలుసుకోవచ్చు. ఒక వేళ అది నకిలీ మద్యం అయితే డిటైల్స్ నాట్ ఫౌండ్ అని స్క్రీన్ పై కనిపిస్తుంది. తద్వారా మద్యం వినియోగదారుడు తాను కొనుగోలు చేసిన మద్యం నాణ్యమైనదో కాదో తెలుసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా సేకరించిన సమాచారం జిల్లా అధికారులు, రాష్ట్ర అధికారుల డేటా బేస్‌కు వెళ్తుంది. పిఠాపురం నియోజకవర్గంలో 23 మద్యం ▶మిగతా 2లో..

రాజమహేంద్రవరానికి మరోసారి జాతీయస్థాయి గుర్తింపు

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు మరోసారి జాతీయస్థాయి గుర్తింపు లభించింది. నీటి సంరక్షణ చర్యలకు గానూ దేశంలో నాలుగవ స్థానం కైవసం చేసుకుంది. 2024-25 కి గానూ కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రకటించిన జల సంచాయ్ జన్ భాగీదారీ (జేఎస్ జేబి) 1.0 ర్యాంకింగ్స్ ప్రకారం, దేశవ్యాప్తంగా చేపట్టిన నీటి సంరక్షణ పనుల్లో రాజమహేంద్రవరం నగరం ఈ ఘనతను అందుకుంది. ఈ జాబితాలో రాయ్‌పూర్ మునిసిపల్ కార్పొరేషన్ (ఛత్తీస్ గఢ్) మొదటి స్థానం., హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (తెలంగాణ) రెండవ స్థానం., గోరఖ్ పూర్ (ఉత్తరప్రదేశ్) మూడవ స్థానంలో నిలిచాయి. నవంబర్ 18న నగర కమిషనర్ ఈ అవార్డును అందుకోనున్నారు. ఈ పురస్కారం ద్వారా రూ. 2 కోట్ల నగదు కూడా అందనుంది. నగరవ్యాప్తంగా 13,298 నీటి సంరక్షణ పనులు చేపట్టిన అధికారులు ఆయా ఫోటోలను సంబంధిత వెబ్ సైట్‌లో అప్ లోడ్ చేశారు. వాటిని పరిశీలించిన కేంద్రం నగరానికి ప్రత్యేక బృందాన్ని పంపించింది. ఈ ఏడాది జూన్‌లో ఢిల్లీ నుంచి వచ్చిన జాతీయ నీటి కమిషన్ సభ్యులు నగరంలోని వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, కంబాల చెరువు, ప్రభుత్వ ▶మిగతా 2లో..

వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు

29 వసతిగృహాల స్థితిగతులపై ప్రత్యేక బృందం పరిశీలన ప్రారంభం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నగర పరిధిలో ఉన్న 29 వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా, విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని జిల్లా కలెక్టర్ షాన్మోహన్ ప్రత్యేక చర్యలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో వసతిగృహాల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు అధికారుల బృందాన్ని నియమించారు. కాకినాడ కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ కెటి సుధాకర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించి, వారి పర్యవేక్షణలో బృందం వసతిగృహాల స్థితిగతులను అధ్యయనం చేయడం మొదలుపెట్టింది. శుక్రవారం సాంబమూర్తి నగరంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను ప్రత్యేక అధికారి కెటి సుధాకర్, అర్బన్ తహశీల్దార్ జితేంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, వాటర్ వర్క్స్ డిఇ డి.లక్ష్మీనారాయణ, శానిటేషన్ సూపర్వైజర్ రాంబాబు కలిసి సందర్శించారు. వంటగది, స్టోర్ రూం, బాత్రూములు, ఆవరణ పరిశుభ్రత తదితర అంశాలను వారు పరిశీలించారు. పాఠశాల ప్రిన్సిపల్ ▶మిగతా 2లో..

పారిశుధ్య కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ

21 నుంచి సమ్మె

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు

విశాలాంధ్ర-తణుకు: ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల 3 నెలల వేతన బకాయిలు, 41 నెలల పిఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని, తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి 150 పడకల స్థాయికనుగుణంగా ▶మిగతా 2లో..

సార్వా కొనుగోలుకు ఏర్పాట్లు

జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని, రైతుల సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టరేట్, రెవిన్యూ డివిజనల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ తన ఛాంబర్లో పౌర సరఫరాలు, సహకార, రవాణా శాఖల అధికారు లతో ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొను గోలు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ధాన్యం సేకరణ ప్రారంభం కానున్న దృష్ట్యా సంబంధిత అధికారులు సత్వరమే ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా అందుబాటులో ఉన్న గోనె సంచులు, ఇంకను కావలసిన గోనె సంచులు, వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, సిబ్బంది శిక్షణ కార్యక్ర మాలు, రైతులకు అవగాహన కార్యక్రమాలు వంటి అంశాలపై చేపట్టిన చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఆర్డీఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, డీఎస్ఓ ఎన్.సరోజ, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ ఎండి ఇబ్రహీం, జిల్లా సహకార శాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా రవాణాశాఖ అధికారి ఎం.వి.కృష్ణా రావు, ఏఎస్ఓ ఎం.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షిపై దాడికి ఏపీయూడబ్ల్యూజే నిరసన

విశాలాంధ్ర - అమలాపురం : పత్రికా స్వేచ్ఛపై దాడి రాజ్యాంగ ఉల్లంఘనకు వస్తుందని ప్రభుత్వాలు మారినా రాజ్యాంగానికి లోబడి నడుచుకోవాలని, సాక్షిలో ప్రచురితమైన వార్తలపై పదేపదే జర్నలిస్టులను పోలీసులు ప్రశ్నించి నోటీసులు ఇవ్వడం జర్నలిస్టుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమే అవుతుందని అమలాపురంలో జర్నలిస్టులు నిరసన తెలిపారు. సాక్షికి మద్దతుగా ఏపీయూడబ్ల్యూజే, అమలాపురం ప్రింటెడ్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ప్రజా సంఘాలు, నాయకులు అమలాపురం కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎంఎన్ వి ప్రసాద్, సీనియర్ పాత్రికేయులు టీకే విశ్వనాథం, నిమ్మకాయల సతీష్ బాబు, పరసా సుబ్బారావు మాట్లాడుతూ పత్రికల్లో ప్రతికూల వార్తలు వస్తే ప్రభుత్వం విచారణ జరిపి దానికి బాధ్యులైన ▶మిగతా 2లో..

మాదకద్రవ్యాల రహిత సమాజానికి కృషి

- కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహ కిషోర్

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : తూర్పు గోదావరి జిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని ఆమె అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, జిల్లాను పూర్తిగా గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దే దిశగా అధికారులందరి సమిష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వినియోగం కేవలం వ్యక్తిగత సమస్య కాదని, సామాజిక సమస్యగా పరిణమించిందని పేర్కొన్నారు. అందుకే ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని సూచిం చారు. పాఠశాలలు, కళాశాలల్లో "ఈగల్ టీమ్‌లు" ఏర్పాటు చేసి విద్యార్థుల్లో మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ డీ. నరసింహ కిషోర్ మాట్లాడుతూ గత జూన్ నుండి ఇప్పటివరకు జిల్లా పోలీస్ మరియు ఈగల్ టీమ్‌లు సుమారు 3,500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా 93 మంది నిందితులపై 23 కేసులు నమోదు చేసినట్లు వివరించారు. గోకవరం, కోరుకొండ, సీతానగరం ▶మిగతా 2లో..

మద్యం విక్రయ వ్యవస్థలో పారదర్శకతకు క్యూ ఆర్ స్కాన్ కోడ్

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మద్యం విక్రయ వ్యవస్థలో పారదర్శకతను,ప్రజల ఆరోగ్య రక్షణను నిర్ధారించడానికి జారీ చేసిన జి.ఓ.ఎం.ఎస్ నెంబర్ 376 ప్రకారం రాష్ట్రంలోని అన్ని రిటైల్ మద్యం దుకాణాలు, బార్లలో అమ్మకానికి ఉన్న ప్రతి మద్యం బాటిల్‌ను తప్పనిసరిగా ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ఏపీ ఈఎస్ఎ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి దాని

నిజస్వరూపం, సీల్, క్యాప్, హోలోగ్రామ్, క్యూఆర్ కోడ్ చెల్లుబాటు వంటి అంశాలను ధృవీకరించాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినట్లు ప్రొహిబిషన్, జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ కె. శ్రీనుబాబు తెలిపారు. ప్రతి దుకాణంలో ఇక్కడ అమ్మే మద్యం క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా నాణ్యత, నిజస్వరూపం ధృవీకరించబడినది అనే బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ చర్యలతో నకిలీ లేదా కల్తీ మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టి, ప్రజలకు నిజమైన, నాణ్యమైన మద్యం మాత్రమే అందేలా ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు.

కృష్ణంరాజుకు డాక్టరేట్ హర్షణీయం

విశాలాంధ్ర-భీమవరం టౌన్ : గత 30 సంవత్సరాలుగా సామాజిక సేవకు అంకితమైన చిలుకూరు కృష్ణంరాజు డాక్టరేట్ అందుకోవడం హర్షించదగ్గ విషయమని ఎస్ ఆర్ కె ఇంజనీరింగ్ కాలేజ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులన్నారు. శుక్రవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణంరాజుకు అభినందన సత్కారం చేశారు. అనంతరం మాట్లాడుతూ కృష్ణంరాజు ఎంబీఏ పూర్తి చేసి తాను

చేసిన ఉద్యోగం సంపాదనలో కొద్దిపాటి ఆదాయం పేద ప్రజల అభివృద్ధికి కృషి చేశారని, ఆయన ద్వారా ఎందరో పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివారని తెలిపారు. అటువంటి వ్యక్తికి డాక్టరేట్ రావడం చాలా ఆనందదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు భూపతి రాజు సత్యనారాయణరాజు ,ప్రెసిడెంట్ గంధి ప్రసాద్, డి. శ్రీధర్ రాజు, ట్రెజరర్ పి. పీటర్, జి. వెంకట భీమరాజు,డి ఎస్ రాజు, వైఎస్ఎస్ఆర్ ఆంజనేయులు, డీకే పుల్లం రాజు మహేష్ రాజు పాల్గొన్నారు.

యుబిఐను సందర్శించిన గూట్లపాడు విద్యార్థులు

విశాలాంధ్ర -భీమవరం: పీయంశ్రీ శిక్షణలో భాగంగా గూట్లపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను (డిఎన్ఆర్ శాఖ)ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ భూపతి రాజన్, సిబ్బంది బ్యాంకు కార్యక్రమాలు, బ్యాంకు లావాదేవీలను విద్యార్థులకు వివరించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో పొదుపు ఖాతాలు,

ఫిక్సెడ్ డిపాజిట్లు పాత్ర, మదుపు, రేట్ ఆఫ్ ఇంట్రెస్ట్, వివిధ రుణాలు వాటి స్వభావం, చెక్స్, లాకర్లు తదితరాలపై విద్యార్థులు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆర్. సత్యవాణి, కె.భాస్కర్ వర్మ, పి.గోపాలరాజు, ఒకేషనల్ కోర్డినేటర్ పి.సంజీవ్ కుమార్, ఒకేషనల్ ట్రైనర్స్ కె.కుమార్, వి.మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తింపు (1వ పేజీ తరువాయి)

కార్యాలయాలు/వార్డు సచివాలయాలలోని ఇంకుడు గుంతలను పరిశీలించారు. వర్షపు నీటిని ఒడిసి పట్టడం, నీటిని పొదుపు చేయడం, పర్యావరణ వ్యవస్థను పునరుద్ధరించడం తదితర అంశాలను పరిశీలించిన బృందం కేంద్రానికి నివేదిక పంపడంతో నగరపాలక సంస్థకు ఈ అవార్డు వరించింది. రాజమహేంద్రవరానికి జాతీయ పురస్కారం లభించడం పై కమిషనర్ రాహుల్ మీనా హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించడంలో కీలకపాత్ర పోషించిన అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

లైసెన్సులు లేకుండా మందు గుండు సామగ్రి అమ్మితే చర్యలు

విశాలాంధ్ర - గణపవరం: లైసెన్సులు లేకుండా దీపావళి మందు గుండు సామగ్రి అమ్మినా, అక్రమ నిల్వలు ఉంచిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నిడమర్రు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నక్కా రజినీ కుమార్ అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా సర్కిల్ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో దీపావళి బాణాసంచా షాపులు పెట్టే వ్యక్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. షాపుల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి సీఐ వివరించారు.

కృషి (1వ పేజీ తరువాయి)

ప్రాంతాల్లో గంజాయి రవాణా ఎక్కువగా జరుగుతున్నట్లు గుర్తించామని చెప్పారు. గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాలు రవాణా లేదా వాడుతున్నట్లు సమాచారం లభించిన వెంటనే ప్రజలు ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 కు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘస్వరూప్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, డిటిఓ సురేష్, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ డీ నాగమణి, జిల్లా ఎక్సైజ్ అధికారి సిహెచ్. లావణ్య, జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్, జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె . వాసుదేవ రావు, ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ శాఖ అధికారులు షియాద్దీన్, జ్యోతి, శశాంక, తదితరులు పాల్గొన్నారు.

నిరసన (1వ పేజీ తరువాయి)

వారిపై చర్యలు తీసుకోవాలే కాని ఆ వార్తలు రాసిన జర్నలిస్టుపై కేసులు పెట్టడం సరికాదన్నారు. 'సాక్షి' పత్రికా, ఎడిటర్ పై పెట్టిన తప్పుడు కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో కే కాశీ విశ్వేశ్వరరావుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్ బాబు, ప్రింట్ అండ్ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు దొమ్మేటి వెంకట్, అరిగెల రుద్ర శ్రీనివాసరావు, మాకే శ్రీనివాసరావు, పొట్టుపోతు నాగు, రమేష్, ఉండు ప్రసాద్, విజయ్, మాకే శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, సురేష్, అబ్బాస్, నల్ల విజయ్, కట్టా మురళి కృష్ణ, భాస్కర్, రత్నం, త్రిమూర్తులు, ఆసు భరత్, మామిడిశెట్టి విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె (1వ పేజీ తరువాయి)

కనీసం ఏభై మందికి తగ్గకుండా పారిశుధ్య కార్మికులను నియమించి కార్మికుల పనిభారం తొలగించాలని కోరుతూ ఈనెల 21 తేదీ నుంచి విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొంటున్నట్లు ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు అన్నారు.

ఎ.పి.మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.సాయికిరణ్‌కు, ఆర్ఎంఒ డాక్టర్ తాతారావులకు సమ్మె నోటీసు సమర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ హాస్పిటల్ పారిశుధ్య కార్మికులకు ఇస్తున్న అతి తక్కువ వేతనాలే నెలనెలా సక్రమంగా ఇవ్వకపోవడంతో పస్తులతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. పిఎఫ్ సొమ్ము సైతం కార్మికుల పిఎఫ్ ఖాతాలకు జమ చేయడం లేదన్నారు. 150 పడకల స్థాయి కనుగుణంగా పారిశుధ్య కార్మికులు లేక తీవ్ర పనిభారంతో కార్మికులు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. తక్షణమే హాస్పిటల్ పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలల వేతన బకాయిలు చెల్లించి వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని భీమారావు డిమాండ్ చేశారు. మెడికల్ ఎంప్లాయిస్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ధర్మాని పుష్పలత,భారతి, సీహెచ్ మంగమ్మ, పి.విజయలక్ష్మి,మెండి శ్రీను, వెంకటలక్ష్మి, ప్రసన్న, ఎం.బేబి, ఇ.హైమావతి, డి. శ్రీనువాసు, చింతాలు, డి. దంమూరు తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాలు (1వ పేజీ తరువాయి)

సత్యవతి విద్యార్థులు ఎదుర్కొంటున్న ఫ్యాన్స్, ట్యూబ్‌లైట్స్, శ్లాబ్ లీకేజీ వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అధికారులు, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ కెటి సుధాకర్ మాట్లాడుతూ "జిల్లా కలెక్టర్ షాన్మోహన్ ఆదేశాల మేరకు వసతిగృహాల పరిస్థితులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం సందర్శన కూడా అదే కార్యక్రమంలో భాగమని ఆయన తెలిపారు. ఈ సందర్శనలో వైద్యులు డాక్టర్ చోడిపల్లి అవినాష్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

మాఫియా (1వ పేజీ తరువాయి)

దుకాణాలు ఉన్నప్పటికీ రాత్రి 10 గంటలకు మూసి వేయాలని నిబంధన ఉన్నా నామమాత్రంగా షాపులు మూసి వేసి కూతవేటు దూరంలో అధికారికంగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రూ.20లు అదనంగా వసూలు చేస్తూ దొంగచాటున విక్రయిస్తు న్నారు. దీనిపై పిఠాపురం ఎక్సైజ్ అధికారి జి. వెంకటలక్ష్మిని "విశాలాంధ్ర" విలేకరి ఫోన్లో వివరణ అడుగగా నియోజకవర్గంలో ఎటువంటి అక్రమ మద్యం విక్రయాలు జరగడంలేదని, అటువంటివి ఏమైనా తన దృష్టిలో ఉంటే తక్షణమే చర్యలు తీసుకుని కేసు నమోదు చేస్తామన్నారు. ఉన్నతాధికా రులు స్పందించి మద్యం దుకాణదారులు అధిక ధరలు వసూళ్ల పై చర్యలు తీసుకోవాలని మద్యం వినియోగదారులు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేయండి : జేసీ

జేసీని సత్కరించిన ఏపీఎన్జీవో నేతలు

విశాలాంధ్ర- ఏలూరు : ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడానికి ఉద్యోగులంతా కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్ సూచించారు. శు

క్రవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏపీఎన్జీవో అధ్యక్ష, కార్య దర్శులు చోడగిరి శ్రీనివాస్, నెరుసు వెంకటరామారావు ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు జేసీ అభిషేక్‌ను ఏలూరు కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఏలూరు జిల్లా అభివృద్ధికి ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సకాలంలో అర్హులకు అందేలా ఉద్యోగులు శక్తివంచన లేకుండా కృషి చేసి జిల్లాను అగ్రభాగాన నిలపాలన్నారు. జేసీని కలిసిన వారిలో జిల్లా, తాలుకా ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులు, మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

22న ఐటీడీఏ కార్యాలయం ముట్టడి

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : ఈనెల 22వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు సీపీఐ జీలుగుమిల్లి మండల కార్యదర్శి కారం దారయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన జీలుగుమిల్లిలో విలేకరులతో మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గం పరిధిలో పోడు భూమి లకు పట్టాలు ఇవ్వాలని, నిర్వాసితుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీపీఐ ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ, జాతీయ కార్యవర్గ

సభ్యురాలు అక్కినేని వనజ, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు కొప్పుల నాగరాజు, ఒర్సు శ్రీను, వాడే రామారావు, కారం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భద్రతకు ఈ-శ్రమ్ పోర్టల్

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో ఈ-శ్రమ్ పోర్టల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పోలవరం ఇన్‌చార్జి, లేబర్ ఇన్స్పెక్టర్ లలిత కుమారి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో వినాయకుని ఆలయం వద్ద శు క్రవారం ఆటో కార్మికుల వద్ద నుండి సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా లలిత కుమారి మాట్లాడుతూ ఈ శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించు కునేవారు ఎటువంటి రుసుము చెల్లించక్కర్లేదని, ఈ నమోదు

ప్రక్రియ సమీప సిఎస్‌సి సెంటర్లు , పోస్ట్ ఆఫీసుల వద్ద గ్రామ, వార్డు సచివాలయంలో చేయించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి ఎస్ సీ లు సాల్మన్ రాజు, రేవతి, జూనియర్ అసిస్టెంట్ ఎం.వెంకటేశ్వర్లు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి ఫీవర్ సర్వే చేయాలి

విశాలాంధ్ర - గణపవరం: ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్ సర్వే చేయాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు అన్నారు. శుక్రవారం పీహెచ్ సి పరిధిలోని అన్ని సచివాల యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. గణపవరం మండలం వరదరాజపురం ఏరియాలో ఫ్రై డే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. సి హెచ్ ఓ మాట్లాడుతూ ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలని, ప్రతి శు క్రవారం ఫ్రైడే డ్రై డే గా ప్రతి ఒక్కరూ పాటించాలని ప్రతి ఇంటిని చుట్టుపక్కల తడి

లేకుండా పొడిగా ఉంచుకోవాలని దోమలు పుట్టకుండా ఉంటాయని చెప్పారు. ఆరోగ్య సిబ్బంది ఎంఎస్, సిడి, ట్రైనింగ్ ప్రతి ఇంటికి వచ్చి వైద్య పరీక్షలు చేస్తున్నారని ప్రతి ఒక్కరు సిబ్బందికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పివి ప్రశాంతి, ఏఎన్ఎం య ఎస్తేరమేరీ, ఆరోగ్య సహాయకుడు ఎం. నల్లయ్య, 104 సిబ్బంది బి. శ్రీనివాస్, ఎస్. రాము పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన

విశాలాంధ్ర -భీమవరం: ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో సమ్మె చేపడతామని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. తమ అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భీమవరం ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణ రావుకు కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే జమచేయాలని, కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులకు యూనిఫాం ఇవ్వడంలేదని, కనీసం పనిముట్లు, సేఫ్టీ గ్లౌజులు, చీపుర్లు తదితర సామాగ్రి ఇవ్వడంలేదని, బ్లీచింగ్, ఫినాయిల్ సైతం కాంట్రాక్టర్ ఇవ్వడంలేదని చెల్లబోయిన విమర్శించారు. కార్యక్రమంలో ఎం.లక్ష్మి, బి.వసంత లక్ష్మి, టి.శారమ్మ, ఎం.సుధారాణి, దుర్గ, జె.ఏసుమణి, మంగ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని సక్రమంగా అమలు చేయాలి

విశాలాంధ్ర - కలిదిండి : గ్రామాలలో ప్లాస్టిక్ నిషేధాన్ని సక్రమంగా అమలు పరిచేందుకు ప్రజలకు తగు సూచనలు చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్. ఫణీంద్ర కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం మండలంలోని సానారుద్రవరం గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు వివరించి వాటిని వాడకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని సక్రమంగా అమలుపరచాలని పంచాయతీ కార్యదర్శి, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఎన్‌డబ్ల్యూపిసి షెడ్డు, గ్రామ సచివాలయం సందర్శించారు. అనంతరం పడమటిపాలెం గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయాల్లో పారదర్శకతకు 'ఎక్సైజ్ సురక్ష' యాప్

విశాలాంధ్ర -నూజివీడు :నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అన్ని మద్యం షాపులలో "ఎక్సైజ్ సురక్ష" మొబైల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించి అమ్మకాలు పూర్తిగా స్కాన్ విధానంలోనే నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎ. మస్తానయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మద్యం సీసాపై ఉన్న క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా మద్యం నాణ్యత, తయారీ వివరాలు, లైసెన్సు స్థితి గురించి వినియోగ దారులు సులభంగా తెలుసుకోవచ్చని తెలిపారు. ఇది నకిలీ మద్యం విక్రయాలను అరికట్టడమే కాకుండా, పారదర్శకతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎక్సైజ్ సిబ్బందిని మద్యం షాపుల వద్ద యాప్ వినియోగాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, అమలు చేయని షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం విక్రయ వ్యవస్థలో సాంకేతికతను వినియోగించడం ద్వారా అక్రమ రవాణా, నకిలీ సీసాలు, అక్రమ నిల్వలపై నియంత్రణ సాధ్యమవుతుందని ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల మేరకు అన్ని మద్యం షాప్‌లు, విక్రేతలు యాప్‌ను సమర్థవంతంగా వినియోగించు కోవాలని, వినియోగదారులు కూడా నకిలీ మద్యం కనిపించినపుడు టోల్ ఫ్రీ నంబర్ 14405 లేదా 9440902462కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మున్సిపల్ వర్కర్స్ సమస్యల పరిష్కారం కోరుతూ

గాంధీ విగ్రహానికి వినతి

విశాలాంధ్ర-ఏలూరు: సుదీర్ఘకాలంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏ.పీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్రవ్యాప్తపిలుపు మేరకు శుక్రవారం ఏలూరులో మున్సిపల్ కార్మికులు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూని యన్ ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పిలుపులో భాగంగా నవంబర్ 3 వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు సమాయత్తం అవుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 13 న మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కనీస వేతనం రూ.26వేలు అమలు జరపాలని, 12వ పిఆర్సి ప్రకటించి 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎ.అప్పల రాజు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి పి. కన్నబాబు, సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, సహాయ కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా, ఏఐటియూసీ జిల్లా నాయకులు పి కిషోర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు బంగారు గురు ప్రసాద్, అంతరాజు కిరణ్, మాదుగుల జగదీష్,బి. నారాయణరావు, బి.బాబి, ఎస్. శ్రీనివాసరావు, అంతరాజు లీలా ప్రసాద్, కాకాని సుబ్బారావు, డి. వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, సిహెచ్. అప్పారావు, సిహెచ్ హరినాథ్,పివి రమణ, బి.గోపి., డి.అప్పారావు, బల్ల దుర్గారావు, కోలా భాస్కరుడు, బేతా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారు

కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ

విశాలాంధ్ర-ఏలూరు: మహిళలకు, బాలిక లకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంట పద్మశ్రీ అన్నారు. స్థానిక గవరవరం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా మహిళాభి వృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవంలో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంట పద్మశ్రీ ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. జ్యోతిప్రజ్వలన చేసి జిల్లా కలెక్టరు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లాలో వివిధ పాఠశాలల్లో వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన 14 మంది బాలికలకు ప్రశంశా పత్రాలు, జ్ఞాపిక లతో జిల్లా కలెక్టరు, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ బాలిక దినోత్స వం సందర్భంగా మేము సైతం అనే ఫ్లెక్సీ బోర్డుపై జిల్లా కలెక్టరు సంతకం చేశారు. మీ రక్షణ - మా కర్తవ్యం శక్తి యాప్‌ను ఆవిష్కరించి, ప్రతి మహిళ, ప్రతి బాలిక శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ విద్య అనే ఆయుధంతో ప్రతి బాలిక ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. గతంలో భ్రూణ హత్యలు, వరకట్నాలు, ఆడపిల్లలంటే వివక్షత ఎక్కువ ఉండేదని దీనివల్ల మహిళలకు చాలా అన్యాయం జరిగేదన్నారు. మారుతున్న కాలంలో చాలా మట్టుకు తగ్గినా అక్కడక్కడ కొన్ని సంఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, విద్యార్థినులు చదువు మీద ప్రత్యేక దృష్టి పెడితేనే వారు సమాజంలో గౌరవంగా జీవించే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో యం. అచ్యుత అంబరీష్, ఐసిడియస్ ఆర్జేడి బి.సుజాత రాణి, పిడి ఏ.శారద, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జె. అమృతం, జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, జిల్లా శిశుసంరక్షణ అధికారి డాక్టర్ సి. హెచ్.సూర్య చక్రవేణి తదితరులు పాల్గొన్నారు.

సి.ఎస్.ఎన్.లో ఫెన్సింగ్ టోర్నమెంట్

విశాలాంధ్ర -భీమవరం: నన్నయ్య యూనివర్సిటీ ఇంటర్ కాలేజీయేట్ ఫెన్సింగ్ టోర్నమెంట్‌ను డాక్టర్ సి.ఎస్.ఎన్ కళాశా లలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రెటరీ, డాక్టర్ చీడే సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ సకుమళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రాచీన ఫెన్సింగ్ కళను భావి తరాలకు అందించాల న్నారు. కార్యక్రమంలో ఫెన్సింగ్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.ఎస్.వి. కృష్ణమోహన్, డిఎన్ఆర్ కళాశాల పీడీ డాక్టర్ బి.వి.నరసింహరాజు, ఏ.శివకుమార్, ఎం.శివ నాగరాజు, కళాశాల పి.డి సిహెచ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తణుకు పురపాలక సంఘం

టెండరు నోటీసు

ఆర్.ఓ.సి.నెం.TNK Mplty/1684/36/2025/E1 తేది : 15-10-2025

తణుకు పురపాలక సంఘ పరిధిలో మున్సిపల్ నిధులతో చేపట్టిన రూ. 100.72 లక్షలు విలువగల 10 నెం.ల డ్రెయిన్లు, రోడ్లు, బిల్డింగ్ పనులు మొదలగు పనులు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి. సంబంధిత వివరములకు www.apeprocurement.gov.in వెబ్‌సైటు నందు **ది.18-10-2025వ** తేదీ నుండి చూడవచ్చును.

కమిషనరు, తణుకు పురపాలక సంఘం

పోలవరం నిర్వాసితులకు న్యాయం

ఎంపీ పుట్టా మహేష్ కుమార్

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపుల్లో భాగంగా తాజాగా గురువారం నాడు రూ. 1,100 కోట్లు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఒక ప్రకట నలో వెల్లడించారు. తమ ఖాతాల్లో పరిహారం సొమ్ము జమ అయిన విషయం తెలుసుకుని, కృతజ్ఞతలు తెలియచేస్తూ కుక్కునూరు, వేలేరుపాడు, దేవీపట్నం మండలాలకు చెందిన నిర్వాసిత కుటుంబాల నుంచి పలువురు ఎంపీ కార్యాలయానికి ఫోన్లు చేయగా, స్పందించిన ఎంపీ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయ్యేలోపే ప్రతి ఒక్క నిర్వాసితునికి కూడా న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇంకా పరిహారం అందాల్సినవారు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించి, ఇళ్ళ నష్టపరిహారానికి సంబంధించి, ఇంకా పెండింగులో ఉన్న బిల్లులతో పాటు కొత్తగా పెట్టబోయే బిల్లులను ప్రభుత్వానికి సమర్పిస్తే, నిర్వాసితుల ఖాతాల్లో పరిహారం జమచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుంటుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడించారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య కార్మికుల సమ్మె

విశాలాంధ్ర -చింతలపూడి: ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది సమ్మె ఐదో రోజుకు చేరింది. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది గత మూడు రోజులుగా వారి పెండింగ్ జీతాలు, పీఎఫ్‌ల కోసం ధర్నాలు చేస్తున్న సంగతి విదితమే. దీనిలో భాగంగా శుక్రవారం చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో పనులను పారిశుధ్య కార్మికులు బహిష్కరించారు. జిల్లా వైద్య అధికారులు కాంట్రాక్టర్ స్పందించకపోవడంతో నిన్నటి నుంచి సమ్మెలోకి దిగారని శుక్రవారం కూడా సమ్మె కొనసాగిస్తున్నారని ఏఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తొర్లపాటి బాబు తెలిపారు. వీరికి ప్రత్యామ్నాయంగా మున్సిపల్ కార్మికులతో శానిటేషన్ పనులు చేయించాలని ఏలూరు జిల్లా డీసీహెచ్ఎస్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న సూపరింటెండెంట్‌లకు ఆర్ఎంలకు ఆదేశాలు ఇవ్వడం సబబు కాదన్నారు. సమస్య పరిష్కారం చేయకుండా ప్రత్యామ్నాయ మార్గాలు వెతకడం సరికాదని ఎవరైనా వచ్చి పనులు చేస్తే అడ్డుకుంటామని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్చరిస్తుందని తెలిపారు. ఈ సమ్మెలో శానిటేషన్ సిబ్బంది తొర్లపాటి మరియమ్మ, రాము కుమారి, వాణి ,సుజాత, సత్యకుమార్ పాల్గొన్నారు. సమ్మెకు సీపీఐ మండల కమిటీ సభ్యులు ఎస్కె కాలేశా మద్దతు తెలిపారు.

సీఎం సహాయనిధి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవడానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్ తెలిపారు. మండలంలోని రామనుజపురం గ్రామానికి చెందిన కొత్తపల్లి సాయిభార్గవ్ ఇటీవల ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన భార్గవ్ ప్రమాదానికి గురికావడంతో అతని కుటుంబ సభ్యులు కష్టాలలో ఉన్నారని తెలుసుకుని నరేష్ ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ కు తెలియజేయగా ఎంపీ మహేష్ స్పందిస్తూ అతని వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయలు ఎల్ ఓ సి నిధులు మంజూరు చేయడంతో, అతనికి వెంటనే తలకు తగిలిన గాయానికి చికిత్స నిర్వహించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేద, మధ్య తరగతి వారికి, ఆపదలో ఉన్న ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని , భార్గవ్ కుటుంబ సభ్యులు ఎంపీ మహేష్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపినట్లు నరేష్ పేర్కొన్నారు.

వైద్య సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర - వేలేరుపాడు : ప్రభుత్వ వైద్యుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు కారం దారయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆశ వర్కర్స్ డాక్టర్ల ధర్నాకు సంపూర్ణ మద్దతు పలుకుతున్నామని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పేద కుటుంబాలకు ఎంతో అవసరమైన ప్రభుత్వ వైద్య సేవలు నిలిచిపోవడం వలన గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వైద్యుల సమస్యలను గుర్తించి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించే దిశగా ఆలోచన చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ వైద్యుల సేవలు ఎంతో అవసరమని వెంటనే వారు విధుల్లోకి చేరేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కరటం సీతామాలక్ష్మి, కారం కుమారి, దాసరి రేవతి, మడివి రాజేశ్వరి, మిరియాల సింధూర తదితరులు ప్రకటనలు ఉన్నారు.

మీడియాపై దౌర్జన్యాలు సిగ్గుచేటు

విశాలాంధ్ర- పాలకోడేరు : ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించే మీడియా గొంతుపై ఉక్కు పాదం మోపడం సిగ్గుచేటని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ అన్నారు. శుక్రవారం పాలకోడేరు మండలం కుముదవల్లి గ్రామంలో కొండేటి లాజర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార ప్రభుత్వ వైఫల్యాలను సాక్షి దినపత్రికలో ప్రచురిస్తుంటే ఆయా పత్రికల విలేఖరులపై అక్రమ కేసులు బనాయించడం, వేధింపులకు గురి చేయడం, పత్రిక ఎడిటర్‌ను బెదిరించడం, సాక్షి కార్యాలయపై దాడులకు దిగటం వంటి అనైతిక చర్యలకు పాల్పడడం సిగ్గుచేటు అన్నారు. ఇటువంటి అనైతిక దాడులను దళిత ఐక్యవేదిక తీవ్రంగా ఖండిస్తుందని ప్రభుత్వానికి ఒక ప్రకటనలో తెలియజేశారు. కార్యక్రమంలో అంబటి ఆనందకుమార్, పట్టెం శుభాకర్, కురుకుంటి పౌలు తదితరులు పాల్గొన్నారు.

గవాయ్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

విశాలాంధ్ర -చింతలపూడి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి ఆర్ గవాయ్‌పై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని చింతలపూడి నియోజకవర్గ ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు ఎం. ముక్తేశ్వరరావు మాదిగ అన్నారు. బి ఆర్ గవాయ్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలని కోరుతూ చింతలపూడి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిరసన కార్యక్రమం నియోజకవర్గ కన్వీనర్ తాళ్లూరి రాజారావు మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు చౌటపల్లి విజయ్ మాదిగ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి దళితులపై దాడి అన్నారు. దీనిని ప్రతి ఒక్కరు ఖండించాలని ఆమె అన్నారు. ఈ సందర్భంగా ఉప తహసీల్దార్ షకీలా బేగం కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంఆర్‌పిఎస్ నాయకులు నక్షత్రం మాదిగ, శెట్టివారి గూడెం ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు గంధం శ్రీను మాదిగ ఎమ్మార్పీఎస్ చింతలపూడి మండల కార్యదర్శి మొనూరి సతీష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

నల్సా పథకాలపై 2కె అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర -భీమవరం: అసంఘటిత కార్మికులు, బాలల కొరకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన పథకాల ప్రయోజనాలు ప్రజల వరకూ చేరవేయవలసిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉందని పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ అన్నారు. అసంఘటిత కార్మికుల, బాలల హక్కుల పరిరక్షణ పథకాలపై అవగాహన ప్రచారంలో భాగంగా శుక్రవారం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో రెవిన్యూ, మునిసిపల్, పోలీసు, డిఆర్‌డిఏ, లేబర్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ, విద్య, వైద్య శాఖలు పట్టణంలో ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత, బాలల సంరక్షణ పై శనివారం ఎస్.ఆర్.ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమా లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎం.సుధారాణి, జి.సురేష్ బాబు, పి.హారీష, ఎన్.జ్యోతి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ శివన్నారాయణ రెడ్డి, ఆర్డీఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి న్యూటన్ న్యాయవాదులు, పలు విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ధ్వంసమైన రహదారి

విశాలాంధ్ర-లింగపాలెం: భోగోలు వెళ్లే ప్రధాన రహదారి నుంచి కలరాయనగూడెం వెళ్లే రహదారి మార్గం పూర్తిగా ధ్వంసమైంది. దాదాపు రెండు కిలోమీటర్ల మేర రహదారి ఉపయోగపడని స్థితిలో ఉంది. దీంతో వాహనాలు వెళ్లేందుకు వీలులేని పరిస్థితి ఏర్పడింది. ఈమార్గంలో రహదారి రెండువైపుల మార్జినులు ఆక్రమణలకు గురవ్వటంతో వర్షపు నీరంతా రోడ్డుపైనే ప్రవహించడం వల్ల రోడ్డు శిథిలమైంది. రోడ్డుపై పెద్ద,పెద్ద గోతులు పడ్డాయి.దీనివల్ల ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని దుస్థితిలో ఈ మార్గం ఉంది. ఈమార్గంలో వచ్చే ఆర్టీసీ బస్సు రావడం లేదు. బస్సు రాకపోవడం వల్ల దూర ప్రాంతం వెళ్ళి చదువుకునే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రామచంద్రపురం నుంచి బాపిరాజుగూడెం అయ్యపరాజుగూడెం, కలరాయన గూడెం మీదుగా అన్నవనేని వారిగూడెం వెళ్లే బస్సు సర్వీసు ఉంది. రహదారి సరిగా లేకపోవడం వల్ల ఈ మార్గంలో బస్సు రావడం లేదు. విద్యార్థులు సకాలంలో స్కూల్స్,కాలేజీలకు వెళ్లలేక పోతున్నారు. తిరిగి వచ్చే సమయంలో వీరు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. శిథిలమైన రహదారిని త్వరితగతిన మరమ్మతులు చేయాల్సి ఉంది.దీన్ని మరమ్మత్తు చేసే ముందు రోడ్డు మార్జినులలో ఉన్న ఆక్రమణలను తొలగించాలి. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఈ రహదారిని పూర్తిస్థాయిలో మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్ క్రైమ్ పోక్సో చట్టాలపై అవగాహన

విశాలాంధ్ర -జీలుగుమిల్లి : పోక్సో, సైబర్ క్రైమ్‌పై విద్యార్థులు అవగాహన పెంపొందించు కోవాలని ఎస్ఐ క్రాంతికుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని బర్రింకలపాడు గిరిజన బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్ నేరాలు, పోక్సో చట్టాలపై, శక్తి యాప్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంపొందించు కుంటే నేరాలను నియంత్రించవచ్చని సూచించారు. ప్రతి విద్యార్థి చట్టాలను తెలుసుకుని గ్రామీణ ప్రాంతాలలో వివరించాలని ఎస్ఐ క్రాంతి కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడుల్ని అరికట్టాలి

విశాలాంధ్ర-ముదినేపల్లి : క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం వెంటనే అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు జాన్ బెన్నీలింగం కోరారు. ముదినేపల్లిలో క్రిస్టియన్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జీసస్ క్రైస్ట్ ప్రేయర్ హాల్లో దైవ సేవకులకు మేలుకొలుపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాన్ బెన్ని మాట్లా డుతూ క్రైస్తవులందరు ఐక్యంగా ఉండాలన్నారు. గ్రామాల్లో సేవ చేస్తున్న పాస్టర్లను చిన్నచూపు చూస్తున్న బడా బాబులు అవమాన కరంగా ప్రవర్తించ డం శోచనీయ మన్నారు. కార్పొరేట్ పాస్టర్లు డబ్బులకు పరిమితమై ఆత్మలను పట్టించుకోవడం లేదన్నారు. దైవ సేవకులకు రావలసిన 13 నెలల గౌరవ వేతనాన్ని ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. ఏపీసిపిఏ అధ్యక్షులు ఎండి ఇస్మాయేల్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో క్రైస్తవులకు అండగా ఉంటామని చెప్పే రాజకీయ పక్షాలు నేడు వెన్నుచూపుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు యేవేలు రాజు, రాజ్ కుమార్, కోఆర్డినేటర్ సతీష్ కుమార్, ప్రతినిధులు ముత్యాల జయరాజు, జోసెఫ్, నాయకులు పాల్గొన్నారు.

గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ పై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని ద్వారకాతిరుమల మండల ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు నల్ల బ్యాడ్జీలు ధరించి ద్వారకా తిరుమల తహశీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దారు సుబ్బారావుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు కంకిపాటి గాంధీ, ఉపాధ్యక్షుడు జూనుపూడి సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

SIR C R REDDY COLLEGE OF ENGINEERING
Affiliated to JNTUK,Kakinada
Vatluru, Eluru - 534 007, Eluru Dist., Phones :08812-230840, 230565

ADMISSION NOTIFICATION FOR B - CATEGORY SEATS IN B.TECH A.Y. 2025-26

Applications for admission into 1st year courses of B.Tech under Category - B for the academic year 2025-26.

CIVIL - 60, CSE - 360, CSE(AI&DS) - 120, CSE(AI&ML) - 60, CSE(CYBER SECURITY) - 60, ECE - 180, EEE - 120, IT - 180, MECH - 60

Applications can be obtained from office or downloaded from the college website **www.sircrrengg.ac.in.** Filled in application along with copies of relevant certificates and registation fee of Rs.1000/- (EAPCET/JEE qualified) and Rs.1200/- (Eapcet / JEE not qualified) can be submitted in the college office in person or by registered post on or before 18-10-2025. Selection process is as per APSCHE guidelines. Provisional Merrit list will be displayed on 24-10-2025. Tution fee will be as per APHERMC / APSCHE .

PRINCIPAL

విద్యతోనే ఉన్నత శిఖరాలు

విశాలాంధ్ర- ఏలూరు : విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించ డం సాధ్యపడుతుందని చైతన్య ఐపీఎల్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గారావు చెప్పారు. దేశ వ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మ కంగా నిర్వహించిన నాలెడ్జ్ అసెస్మెంట్ లెవల్-1 పరీక్షల్లో ఏలూరు నగరంలోని విద్యానగర్ ప్రాంతంలో గల శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఈ పరీక్షల్లో ఎంఏటి-42, పిఏటి-24, సిహెచ్ ఎటి 37 మంది కలిపి మొత్తం 103 మంది విద్యార్థులు నాలెడ్జ్ అసెస్మెంట్ లెవల్-2కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దుర్గారావు మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా పోటీ పరీక్షల్లో కూడా అత్యంత ప్రతిభ కనబరచడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుంకర పార్థసారథి, ఆర్ఐ సిహెచ్.ఉదయ్ భాస్కర్, డీన్ సుధాకర్, సి-బ్యాచ్ ఇంచార్జ్ కెవి.లక్ష్మణ్ కుమార్, ఐపియల్ ఇంచార్జ్ ఎన్. సత్యన్నారాయణ, ప్రైమరీ ఇన్‌చార్జి అరుణ, ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జి ఝాన్సీ, ఒలింపియాడ్ ఇన్‌చార్జి కె.సుమ ప్రియ తదితరులు విద్యార్థులను అభినందించారు.

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం:కల్తీ లేని ఆహారం ఆరోగ్య పరిరక్షణ అవగాహన కార్యక్రమం కరపత్రాన్ని తాడేపల్లి గూడెం శాసన సభ్యులు క్యాంపు కార్యాలయంలో శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కల్తీ లేని ఆహారాన్ని అందించాలన్న కృతనిశ్చయంతో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు ప్రజారోగ్య పరిరక్షణ కొరకు అధికారులు ప్రతి ఒక్కరూ పాటుపడుతున్నారన్నారు. ఎక్కడబడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను పారవేయరాదని, అటువంటి వారిపై రూ.10 వేలు జరిమానా విధిస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎల్ ఎస్ వి నాగేశ్వరరావు, ఎస్సై నాగరాజు, పాలూరి వెంకటేశ్వర్రావు, మైలవరపు రాజేంద్రప్రసాద్, రామిశెట్టి సురేష్, మట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడులో ప్రమ్ నూజివీడు ఉయ్ లీడ్

విశాలాంధ్ర -నూజివీడు :విద్యార్థులు, సోషల్ మీడియా ప్రతినిధులు వి లీడ్ కార్యక్రమాన్ని వేదికగా చేసుకొని తమ ప్రతిభను చాటుకోవాలని నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న అన్నారు. శుక్రవారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రమ్ నూజివీడు ఉయ్ లీడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ ప్లాట్ ఫాం ద్వారా యువత ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవా చర్యలు, విజయాలను ప్రజలకు చేరవేయడానికి అవకాశం లభిస్తుందన్నారు. ఈ డిజిటల్ ప్లాట్ఫామ్ ద్వారా సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్స్, డిజిటల్ మీడియా, కంటెంట్ క్రియేషన్, సోషల్ మీడియా ప్లాట్ఫామ్స్, వీడియో, ఫోటో డాక్యుమెంటేషన్ల ద్వారా, ప్రభుత్వంతో పాటు నూజివీడు అభివృద్ధిలో భాగస్వాములు అవ్వవచ్చన్నారు.

బంగారు ఆభరణాల చోరీపై కేసు నమోదు

విశాలాంధ్ర-టి నరసాపురం: బంగారు ఆభరణాల చోరీ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన జాలా వెంకటేశ్వర్రావు ఈనెల 15న భార్య పిల్లలతో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అచ్యుతాపురం గ్రామానికి వెళ్ళారు. తిరిగి ఈనెల 17న ఇంటికి వచ్చేసరికి ఇంటితాళం పగులగొట్టి ఉండడంతో అనుమానంతో లోనికి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి గుర్తు తెలియని దొంగలు అరకాసు బంగారపు చెవిపోగు, జత వెండి పట్టీలు, రూ.5వేల నగదు అపహరించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మంత్రిని కలిసిన కమిషనర్

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ మీనా శుక్రవారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

ఆ వాయిస్ నాది కాదు: మజ్జి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ: మద్యం వ్యాపారు లతో మాట్లాడినట్లుగా వైరల్ అవుతున్న వాయిస్ తనది కాదని, అది ఫేక్ అని నగర టిడిపి అధ్యక్షుడు మజ్జి రాంబాబు స్పష్టం చేశారు. ఈమధ్య ఏఐతో నకిలీ వీడియోలు, వాయిస్‌లు సృష్టిస్తున్నట్లు చూస్తున్నామని ఇది కూడా అలాంటిదేనని ఆయన అన్నారు. దీనిపై పోలీసులకు పిర్యాదు చేశానన్నారు. స్థానిక పాతసోమాలమ్మ పుంత రోడ్డులోని శ్రీకన్య ఇన్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దర్యాప్తు చేస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. మద్యం వ్యాపారులతో తాను మీటింగ్ పెట్టినట్లు నిరూపించాలని సవాల్ చేసారు. తనకు లిక్కర్ షాపులు లేవని, మద్యం వ్యాపారులతో మాట్లాడాల్సిన అవసరం లేదని, కేవలం తన ఎదుగుదలను చూసి ఓర్వలేక ఇలా చూపిస్తున్నారని, ఖబడ్దార్ భరత్ అని మజ్జి రాంబాబు హెచ్చరించారు. గతంలో కూడా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తిట్టినట్లు ఒక ఫేక్ ఆడియోను భరత్ సృష్టించారని, ఆయనకు ఇలాంటివి అలవాటేనని రాంబాబు అన్నారు. నగరంలో బలమైన్ సామాజిక వర్గంగా ఉన్న తూర్పు కాపు సంఘం కార్యదర్శిగా చాలా ఏళ్ళు పనిచేసి, ఇపుడు అధ్యక్షుడిగా ఉన్నానని, ఎక్కడా తప్పు చేయలేదని మజ్జి రాంబాబు అన్నారు. కావాలని కొంతమందిని కోవర్టులుగా కూటమి పార్టీల్లోకి పంపించి పబ్బం గడుపుకోవాలని భరత్ చూస్తున్నారని ఆయన ఆరోపించారు. మీడియా సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు దాస్యం ప్రసాద్, ఈతలపాటి రవి, బొర్రా చిన్ని, సలాది ఆనంద్, బంగారు నాగేశ్వరరావు, యర్రంశెట్టి రాజ్ కుమార్, ఆడారి లక్ష్మీ నారాయణ, దుద్దేటి నాగేంద్ర, కడియాల వాసు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

గుగూల్ రాకపై కుడుపూడి హర్షం

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ: సాగర నగరం విశాఖపట్నానికి గుగూల్ ఏఐ (కృత్రిమ మేథ) డేటా సెంటర్ రావడం ప్రపంచంలోనే ఓ గొప్ప విషయమని, దేశ భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానానికి ,ఉపాధి అవకాశాలకు ఒక మైలు రాయి అని ఏపీ శెట్టి బలిజ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లక్షా 33 వేల కోట్ల పెట్టుబడులతో గుగూల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకు రావడంలో మంత్రి నారా లోకేష్ కృషి అభినందనీయమన్నారు. ప్రపంచంలోనే అమెరికా తర్వాత అతి పెద్ద ఏఐ హబ్ ను గుగూల్ క్లౌడ్ సంస్థ విశాఖ లో ప్రారంభించడానికి ఒప్పందం చేసుకోవడం చరిత్రలో మైలురాయి అని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మద్దుల

విశాలాంధ్ర- కొవ్వూరు: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గం ఉపాధ్యక్షులుగా మద్దుల వీర వెంకట సత్యనారాయణ ఎంపికయ్యారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు చెందిన ఆర్యవైశ్య నాయకులు మద్దుల వీర వెంకట సత్యనారాయణకు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్రఉపాధ్యక్షునిగా నియమించామని రాష్ట్ర అధ్యక్షులు దేవతీ భగవన్నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19న మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్లో జరిగే వామ్ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా అధ్యక్షులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆర్యవైశ్య సోదరులు, మహిళా కమిటీలు, ఆర్యవైశ్య యువజనలు అందరు కూడా పాల్గొని రాష్ట్ర నాయకుల సమక్షంలో జరిగే ప్రమాణ స్వీకార మహోత్సవానికి తరలిరావాలని విజ్ఞప్తి చేశారు . ఉపాధ్యక్షులు మద్దుల వీర వెంకట సత్యనారాయణ కు పదవి కేటాయించినందుకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సోదరులు, కొవ్వూరు ఆర్యవైశ్య కమిటీలు అందరూ అభినందనలు తెలియజేశారు.

సజావుగా అభివృద్ధి, సంక్షేమం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం సజావుగా జరుగుతున్నాయని, ముఖ్యంగా రాజమండ్రికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ లో జాతీయ స్థాయిలో 19వ స్థానం, రాష్ట్రంలో రెండవ స్థానం లభించిందని గుర్తుచేసారు. స్థానిక హెూటల్ జగదీశ్వరిలో శుక్రవారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ జలశక్తి అవార్డుతో పాటు రూ 2కోట్లు బహుమతి మున్సిపల్ కార్పొరేషన్ కి లభిం చిందని అన్నారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి కల్సి కట్టుగా చేస్తున్న అభివృద్ధి, పడుతున్న శ్రమకు తగిన ఫలితం కన్పిస్తోందన్నారు. ముఖ్యంగా అభి వృద్ధికి సంబంధించి గడిచిన ఏడాది కాలంగా నగరంలో 158కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్ర మాలు పూర్తిచేశామని, అలాగే 2025-26లో 120 కోట్ల రూపాయల అంచనాతో పనులు చేపట్టాలని నిర్ణయించి, ఇందులో రూ 30కోట్ల పనులు నడుస్తున్నాయని ఎమ్మెల్యే వాసు వివరించారు. మొత్తం మీద కూటమి ప్రభుత్వం వచ్చాక నగరంలో 278కోట్ల రూపాయల పనులు అవుతున్నాయని చెప్పారు. ఎన్ కాప్ కింద వైస్సార్ సిపి హయాంలో నిర్లక్ష్యం కారణంగా కోటి రూపాయలు మాత్రమే రాగా,కూటమి వచ్చాక 11కోట్లు మంజూరు చేయించగలిగామన్నారు. సిఎస్సార్ నిధుల పనులు పారదర్శకంగా చేస్తున్నామని, స్వయంగా తాను శ్రద్ధ తీసుకుని సిఎస్సార్ నిధులు అవకతవకలకు తావులేకుండా, వ్యక్తిగత ఎజెండా లేకుండా ఖర్చు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వాసు చెప్పారు. 6.38కోట్ల రూపాయల సిఎస్సార్ నిధులు వెచ్చిస్తున్నామన్నారు. సమావేశంలో ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ నాయకులు వర్రే శ్రీనివాసరావు, దొండపాటి సత్యం బాబు, ఉప్పులూరి జానకి రామయ్య, బుడ్డిగ రాధా, బుడ్డిగ రవి, కంటిపూడి శ్రీనివాస్, శెట్టి జగదీష్, కొయ్యల రమణ, మొకమాటి సత్యనారాయణ, తంగెళ్ళ బాబీ, కరగని వేణు, మహ్మద్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: సీజేఐ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దేవరపల్లి తహశీల్దారు ఎం.శ్రీనివాసుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. తహశీల్దార్ కార్యాలయంలో గోపాలపురం నియోజకవర్గం ఎంఆర్పిఎస్ ఇన్చార్జి తాతపూడి సురేష్ మాదిగ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా సురేష్ మాదిగ మాట్లాడుతూ సుప్రీంకోర్టు జడ్జి గవాయ్‌పై దాడి చేసి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు ఈ కార్యక్రమంలో దేవరపల్లి మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షుడు కోడి సూరిబాబు దేవరపల్లి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చాపల శేఖర్ ఎంఆర్పిఎస్ నాయకులు కొమ్మర నాగేంద్ర కోడి సుధీర్ ప్రత్తిపాటి లోకేష్ శెట్టి సన్నీ మల్లెపూలు సుధీర్ పాల్గొన్నారు

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేత

విశాలాంధ్ర-దేవరపల్లి: రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈనెల 14 15 16 తేదీల్లో నిర్వహించిన ఆహార మహోత్సవంలో దేవరపల్లి బిహెచ్ఎస్ఆర్ అండ్ వివిఎల్ఎం డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ పరిధిలో ద్వితీయ స్థానం సాధించి యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ప్రసన్న చేతుల మీదుగా బహుమతులు ప్రశంస పత్రాలు అందుకున్నారు ఈ సందర్భంగా శుక్రవారం దేవరపల్లి బిహెచ్ఎస్ఆర్ అండ్ వి ఎల్ ఎం డిగ్రీ కళాశాలలో శుక్రవారం యూనివర్సిటీ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు అభినందన సభ జరిగింది ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బీడీఎన్ కుమార్ కళాశాల ఏవో డి ఆనంద్ ప్రసాద్ వైస్ ప్రిన్సిపాల్ ఎం జె ప్రియాంక అధ్యాపకులు పి రాము ఎస్ వెంకటేష్ నూతలపాటి వెంకటరావు కే మహీధర్ బి కిరణ్ శ్రీనివాసరావు అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని అభినందించి స్వీట్లు అందజేశారు క్విజ్ విభాగంలో ఆర్ శిరీష కె మాధవి వై అనిత కె వని జ అదేవిధంగా పోస్టర్ ప్రజెంటేషన్ విభాగంలో ఎండి షబానా పాల్గొన్నారు

వైభవంగా పటికబెల్లా తులాభారం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి బాలదుర్గ ఆలయంలో అంగరంగ వైభవంగా రెండు పటికబెల్లా తులాభార కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి ముందుగా బాల దుర్గమ్మ అమ్మగారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పటికి బెల్లం తో తులాభారం నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు జారిపెల్లి గ్రామానికి చెందిన ఆత్మల సూర్యనారాయణ భార్య లక్ష్మీకాంత్ కి పనికి బెల్లంతో తులాభారం నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు అదేవిధంగా తాడేపల్లిగూడెం మండలం తాడేపల్లి గూడెంగ్రామానికి చెంది కొంపెర్ల శ్రీనాథ్ రమ్యకృష్ణ దంపతుల కుమారుడు దర్శి మణి వెంకట్ కు పటిక బెల్లం తో తులాభారం నిరసించి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ కోశాధికారి కామిశెట్టి దుర్గారావు గారపాటి అప్పారావు కామిశెట్టి ధర్మరాజు పైడికొండల వెంకటేశ్వరరావు జాజిమొగ్గల ప్రభాకర్ రావు పిన్నమణి వెంకటకృష్ణ కామిశెట్టి మంగ మాతు సీత మహిళా భక్తులు, భక్తులు పాల్గొన్నారు

ధ్యాన మందిరంలో నందలహరిపారాయణం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య ధ్యాన మందిరంలో శుక్రవారం నాడు సౌందర్యలహరి శివ నందలహరి పారాయణా జరిగింది ఉదయం ఒకే పానిపట్టపై గల విగ్నేశ్వరుడు జగద్గురు ఆదిశంకరాచార్యులు మహాలక్ష్మి సరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు ఈ సందర్భంగా జగద్గురు శ్రీ శ్రీ శ్రీ ఆదిశంకరాచార్య ధ్యాన మందిరం మహిళా కమిటీ సభ్యులు సౌందర్యలహరి శివానందలహరి పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ లక్ష్మీ రాణి చిరవూరి బేబీ చెరువూరి సుబ్బలక్ష్మి వెలగా సుబ్బలక్ష్మి తీగల గాయత్రి అడ్డా కనకలక్ష్మి పాల్గొన్నారు.

గెజిటెడ్ హోదా కల్పించాలి

విశాలాంధ్ర - గోపాలపురం : మండల స్థాయి ఉద్యోగులుగా పనిచేస్తున్న ఉపగణాంకా అధికారులకు గజిటెడ్ హెూదా కల్పించాలంటూ గ్రీవెన్స్ డే సందర్భంగా రాజమండ్రి లోని కలెక్టరేట్ నందు జిల్లా ప్లానింగ్ ఉద్యోగుల సంఘం(ఆప్సేస్పా) జిల్లా అధ్యక్షుడు జోడాల వెంకట్ జాయింట్ డైరెక్టర్ అప్పలకొండకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న ఏ.ఎస్. ఓ లకు కంప్యూటర్లు , స్టేషనరీ మరియు ఇన్చార్జి మండలాలలో నియామకాలు చేపట్టాలి అని కోరారు. ఉప గణాంక అధికారులకు గెజిటెడ్ స్థాయి కల్పించాలి అని, ఉద్యోగ భద్రతలో భాగంగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన మరియు గ్రామ బీమా యోజన పథకం లో మండల స్థాయి అధికారిగా ఉన్న ఏ.ఎస్. ఓ ను ప్రైమరీ వర్కర్ గా తీసేసి సూపర్ వైజర్ గా నియమించాలని కోరుతూ జాయింట్ డైరెక్టర్ అప్పలకొండ కి వినతి పత్రం సమర్పించారు. అధ్యక్షులు జోడాల వెంకట్ అన్నారు. గత 25 సంవత్సరాలుగా ఉద్యోగం చేసినా ప్రమోషన్ లేకుండా ఉన్న మాకు త్వరలో ప్రమోషన్ వచ్చేలా కృషి చేయాలి అని అన్నారు. మండల ప్లానింగ్ అధికారిగా పేరు మార్చాలని కోరారు. సెక్రటరీ భగవాన్ దాస్ మాట్లాడుతూ ఏ.ఎస్. ఓ లు స్వంత శాఖ పనితో పాటు వ్యవసాయ మరియు ఇతర శాఖల పని చేస్తున్నారు అని. ఏ.ఎస్. ఓ లను మండల స్థాయి ఉద్యోగిగా గుర్తించి మాకు గౌరవాన్ని కల్పించాలి అని అన్నారు.

వరి కోతలు ప్రారంభం

విశాలాంధ్ర - సీతానగరం: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఖరీఫ్ సీజన్ వరి కోతలు ప్రారంభం అయ్యాయి. బోర్ల ఆధారంగా ముందుగా విత్తిన వరి పంటలు రైతులకు గత వారం రోజుల నుంచి కోతలు జరుగుతున్నాయి. ఈ సీజన్ ప్రారంభంలో పచ్చి ధాన్యం 75 కేజీలు 1400 రూపాయలు చప్పున కొనుగోలు జరపగా రెండు రోజుల నుంచి 1350 రూపాయలు చప్పున కొనుగోలు జరుపుతున్నారు అని రైతులు చెపుతున్నారు. సాధ్యమైన అంత త్వరగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. ఇది ఇలాగ ఉండగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం అయ్యేందుకు ఇప్పటికే తహసిల్దార్ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారిని గౌరీ దేవి, ఎమ్ ఎస్ ఓ నాగలక్ష్మి వందన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కొనుగోలు కేంద్రాలపై శిక్షణ ఇచ్చారు.

న్యాయవాదిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - కడియం : దేశ అత్యున్నత న్యాయస్థానంలో పనిచేస్తున్న జస్టిస్ గవాయి పై కోర్టులో దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ కడియం మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ మందపల్లి రత్నరాజు అన్నారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ విఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ కడియం తాసిల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, ఎంఎల్ఎఫ్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇలాంటి దాడి మళ్లీ పునరావృతం కాకుండా కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం తాసిల్దార్ సునీల్ కుమార్ కి వినతి పత్రం అందజేశారు. యార్లగడ్డ సతీష్ మాధిగ, కొడమంచిలి కోటి మాదిగ, చింతపర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం, కడియపులంక పంచాయతీ పరిధి వెంకాయమ్మ పేట వద్ద జాతీయ రహదారి పై గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం లో గుర్తు తెలియని యువకుడు మృతి చెందినట్లు కడియం సిఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. మృతుడి వయస్సు 25-30 సంవత్సరాలు మధ్య ఉంటుందన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. జరిగిన సంఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వైద్యులు నిరసన

విశాలాంధ్ర - సీతానగరం: వైద్యులు తమ న్యాయమైన డిమాండ్లకు సాధన కోసం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. శుక్రవారం సీతానగరం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది తమ డిమాండ్ల కోసం నిరసన చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

తుకులగూడెం ఎస్సీ భూములపై నిషేధాజ్ఞలు

విశాలాంధ్ర-తాళ్లపూడి: తాళ్లపూడి మండలం తుపాకులు గూడెం రెవెన్యూ గ్రామానికి చెందిన సర్వే నెం.49/2పిలో ప్రభుత్వం ఎస్సీలకు అందించిన భూములు, భూమిలోని పంట (జామాయిల్) విషయం లో వివాదం కొన సాగుతున్నది. భూమి పట్టాలు మీవే, పంట విషయం తెలియదు అనే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. పట్టాలున్న వారిని పంట కోసుకు నియతం లేదని ఆరోపిస్తుండగా, ఈ నేపథ్యం లో అధికారులు శుక్రవారం నిషేధాజ్ఞలు ప్రకటించారు. ఈ మేరకు ఆ భూములు వద్ద హెచ్చరిక ఫ్లెక్సీ లను ఏర్పాటు చేసి నిషేధాజ్ఞలు ప్రకటించారు. ఈ మేరకు ఆర్ ఐ సాహిత్య, వి.ఆర్ ఓ నాగేశ్వరరావు, పోలీస్ కానిస్టేబుల్ సురేష్ లు ఫ్లెక్సీ లను ఏర్పాటు చేశారు.

ఇళ్ల స్థలాలకు పొజిషన్ చూపండి

విశాలాంధ్ర-తాళ్లపూడి: తాళ్లపూడి మండలం లోని తిరుగుడుమెట్ట గ్రామం లో పేద ప్రజలకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చారు. కానీ లబ్ధిదారులకు పొజిషన్ చూపించక పోవటం వల్ల నేటికి ఇల్లు నిర్మించుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు సంవత్సరాల క్రితమే గ్రామం లో 57 మందికి ఇంటి పట్టాలు ఇచ్చారు. వారికి పొజిషన్ చూపించాలని గ్రామానికి చెందిన నాయకులు శుక్రవారం తాళ్లపూడి తహసీల్దార్ కు వినతి పత్రం అందచేసారు. తాళ్లపూడి ఎంపీపీ జొన్నకుటి పోసిరాజు, వైకాపా నాయకులు వల్లభ శెట్టి చిన్ని, వల్లభ శెట్టి శ్రీనివాస్, సాలి రాజు, బొంతా సాయి తహసీల్దార్ ను కలిసిన వారిలో ఉన్నారు.

మంత్రి దుర్గేష్‌ను కలిసిన మునిసిపల్ కమిషనర్

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : రాజమహేంద్రవరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన రాజమహేంద్రవరం నూతన మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ అభివృద్ధి పై అనేక సూచనలు చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ మీనాకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్ , కొత్త బాధ్యతలలో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

దేవాలయాల్లో దొంగతనాల ముఠా అరెస్టు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ శ్రీరాహుల్ మీనా, ఐపీఎస్ ఆదేశాల మేరకు, కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో, రావులపాలెం రూరల్ సిఐ విద్యాసాగర్, ఆత్రేయపురం ఎస్సై రాము, అమలాపురం క్రైం సిఐ గజేంద్ర కుమార్,సిబ్బంది కలసి నిర్వహించిన విభాగీయ చర్యలో దేవాలయాల్లో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు ముఠా సభ్యులను అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం, నక్క కాంతారావు , వెంకటేష్ 9 అక్టోబర్ రాత్రి పేరవరం గ్రామంలోని వెంకటేశ్వర స్వామి గుడికి ప్రవేశించి, స్వామి వారి విగ్రహానికి సంబంధించిన వెండి కిరీటం, అభయ హస్తాలు, శంకుచక్రాలు, శత గోపురం, రోల్ గోల్డ్ హారం వంటి విలువైన వస్తువులను దొంగిలించారు. ఆత్రేయపురం ఎస్సై రాము కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన తరువాత, 17 అక్టోబర్ ఉదయం నమ్మకమైన సమాచారం ఆధారంగా, పోలీసులు ముఠా సభ్యులను పిచ్చుకలంక ఆంజనేయస్వామి గుడి సమీపంలో పట్టుకున్నారు.

అక్రమ లిక్కర్ వ్యాపారుల తీరుపై ఆందోళన

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : అక్రమ లిక్కర్ వ్యాపారంలో రాజమండ్రి టిడిపి నేతల తీరును వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ ఎండగట్టారు. చర్యలకు డిమాండ్ చేసారు. ఈమేరకు శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయానికి చేరుకొని, కొద్దిసేపు భైఠాయించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్ బిఎం మురళీకృష్ణకు రాజమండ్రిలో అక్రమ లిక్కర్ వ్యాపారంలో టిడిపి నేతల తీరుపై ఫిర్యాదు చేస్తూ, చర్యల కోసం వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా మాజీ ఎంపీ భరత్ మీడియాతో మాట్లాడుతూ రాజ మండ్రిలో టిడిపి నేతల కనెక్షన్లతో మద్యం అక్రమంగా జరుగుతోందని ఆరోపించారు. అక్రమ మద్యం వ్యాపారాన్ని రెగ్యులరైజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారని భరత్ విమర్శించారు ఈ వ్యవహారంలో టిడిపి ఎమ్మెల్యేను భర్తరఫ్ చేయాలని సీఎం చంద్రబాబును డిమాండ్ చేసారు. మద్యం దుకాణదారులతో ఫోన్లో మాట్లాడిన నగర టిడిపి అధ్యక్షుడు మజ్జి రాంబాబు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఏ ఏ బ్రాండ్లకు ఎంతెంత వసూలు చేయాలో నిర్ణయించు కుంటున్నారని, ఆ బ్రాండ్లు ఏంటో బయట పెట్టా లన్నారు. అక్రమ మద్యం వ్యాపారాన్ని లిమిటెడ్ కంపెనీగా మార్చేస్తున్నారని ఆయన విమర్శించారు. అక్రమాలకు బైలా రాసుకోవాలని అనుకోవడం దారుణమన్నారు. నకిలీ మద్యం తాగి జిఎస్ఎల్ ఆసుపత్రిలో ముగ్గురు యువకులు మృతి చెందారని, అందుకే రాజమండ్రిలో చలామణి అవుతున్న నకిలీ మద్యంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని భరత్ డిమాండ్ చేసారు. ఎక్సైజ్ అధికారులకు ఎన్ని కేసులు ఇవ్వాలో కూడా టిడిపి నేతల ఆధ్వర్యంలో సిండికేట్ నిర్ణయం చేస్తోందన్నారు. అందుకే ఎక్సైజ్ అధికారులు ప్రమేయంపై కూడా విచారణ చేయాలని భరత్ డిమాండ్ చేసారు.

జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ విజయవంతం

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జిల్లా విద్యాశాఖ మరియు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో, జిల్లా విద్యాశాఖ అధికారి మార్గదర్శకత్వంలో జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ అమలాపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి, గుబ్బల సూర్యప్రకాశం, పి రామలక్ష్మి, మూర్తి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బీర హనుమంతరావు, మరియు సెక్టోరియల్ ఆఫీసర్లు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుండి 44 మంది విద్యార్థులు ఈ సెమినార్‌లో పాల్గొన్నారు. ఇటీవల మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు కూడా ఈ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం పొందారు అనే అంశంపై విద్యార్థులు తమ సైన్స్ పేపర్ ప్రెజెంటేషన్లను సృజనాత్మకంగా మరియు విజ్ఞానపరంగా ప్రదర్శించారు. న్యాయనిర్ణేతలుగా ఏవిఎన్ నరసింహారావు, ఉప్పలపాటి మాచిరాజు, పివి బ్రహ్మానందం వరద శ్రీనివాసు, ఎస్ బాబులు సీతారామలక్ష్మి, నరసింహారావు, శెట్టిపల్లి మాధురి, వ్యవహరించారు. పోటీలలో అయినవిల్లి మండలం జగన్నాథపురం విద్యార్థిని ప్రథమ స్థానం, ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. విజేతలు రాష్ట్ర స్థాయిలో జిల్లా తరఫున పోటీ చేయనున్నారు. రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్ జై కన్వెన్షన్ హాల్, లైన్లో కాలేజీ నందు నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసిన జిల్లా సైన్స్ అధికారి జివిఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, "విద్యార్థుల్లో సైన్స్ ఆవిష్కరణ దృక్పథం పెంపొందించడానికి ఇలాంటి సెమినార్లు ఎంతో అవసరం. విద్యార్థుల ప్రతిభ రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిధ్వనిస్తుందని విశ్వసిస్తున్నాను" అని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

ఎస్సై లక్ష్మీకాంతం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి జడ్పీ హైస్కూల్లో సైబర్ నేరాలు పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎస్ లక్ష్మీకాంతం అన్నారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మీకాంతం మాట్లాడుతూ సోషల్ మీడియాలో పరిచయాలు, ఆన్లైన్ వేధింపులు, ప్రేమ పేరుతో వలవేసి చేసే ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు, మహిళలపై జరుగుతున్న నేరాలు, ఈవ్ టీజింగ్, మరియు చట్టాలపై కూడా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ళ బారిన పడకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఫోక్సో కేసు, ఈవ్ టీజింగ్, అలాగే రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో నొప్పుల నుండి ఉపశమనం

వైద్యులు మోహిత్ సీతలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక అన్నపూర్ణ డే కేర్ హోమ్ లో శ్యామ్ అడ్వాన్స్ ఫిజియోథెరపీ అండ్ రిహెబిలిటేషన్ సెంటర్ అధినేత డాక్టర్ మోహిత్ సీత ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత అధునాతన ఫిజియోథెరపీ మెగా వైద్య శిబిరాన్ని రాష్ట్ర భారతీయ కిసాన్ సంఘ్ కన్వీనర్ డాక్టర్ ఉప్పుగంటి భాస్కరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహిత్ మాట్లాడుతూ సరైన జాగ్రత్తలు మరియు వ్యాయామం చేయడం ద్వారా భుజం నొప్పి మోకాళ్ళ నొప్పులు నడుము నొప్పి వంటి వాటి నుండి విముక్తి పొందవచ్చు అని వాటి నుండి ఎలా ఉపశమనం పొందాలో శిక్షణ ఇచ్చారు. ఉప్పుగంటి భాస్కరరావు, వందనాదేవి, సీతారత్నం, తేజశ్రీ అన్నపూర్ణ, శ్రీధర్, కుమార లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు రాజమహేంద్రవరం

I.P.No.25/2025

Between:-
Sainubarapu Durgayya, S/o.Durgayya, Hindu, aged 33 years, resident of D.No.2-160, Kondagunturu Village, Rajanagaram Mandal,E.G.Dt.
...Petitioner

AND

1) Palleti Durga Pavan Kumar, S/o. Chinna, aged about 44 years, Two Stair Building, Near Current office, Church Street, Sampath Nagaram, Rajanagaram Mandal,E.G.Dt.
2) Gollapalli Bhavani Shankar, S/o. Nagaraju, aged 40years, resident of Kondagunturu Village, Rajanagaram Mandal, E.G.Dt.
3) Pemmanaboyina Venkatesh, S/o. Durga Rao, aged about 35 years, resident of Near Jaggamcheruvu Main Road, Kondagunturu Village, Rajanagaram Mandal, E.G.Dt.
4) Palleti Abhinash, S/o. Pentayya, aged 44 years, resident of Kondagunturu Village, Rajanagaram Mandal, E.G.Dt.
5) Pemmanaboyina Ramakrishna, S/o. Govindu, aged50years, resident of Near Saibaba Temple, 2nd House, Kondagunturu Village, Rajanagaram Mandal, E.G.Dt.
6) Pemmanaboyina Govindu, S/o. Venkataratnam, aged 39 years, resident of Nearby house of Anjaneya swami Temple, Kondagunturu Village, Rajanagaram Mandal, E.G.Dt.
7) Girijala Hanumanthu, S/o. Baburao, agedas years, 5th House of after Vinayaka Temple, Kondagunturu Village, Rajanagaram Mandal, E.G.Dt.
8) Pothula Nagalakshmi, W/o. Venkanna, aged 36 years, resident of D.No 2-93, Ramalayam Street, Kapavaram Village, Korukonda Mandal, E.G.Dt.
...Respondents

పై గ్రంథములో పిటీషనరు/డెటరు తనకు గల అప్పులు చెల్లించు శక్తి లేదని ఇన్సాల్వెంటుగా/దివాళాదారుగా డిక్లేరు చేయమని కోరుచూ పై పిటీషను దాఖలు చేసియున్నారు. కావున పైన తెలిపిన రెస్పాండెంట్లుకు గాని, ఎవరికైనా పై గ్రంథములో ఏమైనా అభ్యంతరములు ఉన్న ఎడల **ది.22-10-2025వ** తేదీన పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం గం**10.30ని**లకు హాజరై సారికి గల అభ్యంతరములు పై కోర్టు వారి ఎదుట మనవి చేసుకోవలెను. కావున ఎల్లరుకు తెలియపర్చడమైనది.

D.అమ్ములు
అడ్వకేట్
రాజమండ్రి రాజమండ్రి
ది.16-10-2025 సెల్.9393202903

ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో 'ఉచిత కంటి పరీక్షల శిబిరం'

విశాలాంధ్ర - గండేపల్లి : స్థానిక ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో 17 అక్టోబర్ 2025వ తేదీన కళాశాల ఎన్ఎస్ఎస్, యన్‌సీసీ విభాగాలు మరియు అంజు ఐ కేర్, కాకినాడ వారి సంయుక్త ఆధ్వర్యంలో, ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించామని ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డా పి కృష్ణారావు తెలియచేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తమ కళాశాల ఎన్ఎస్ఎస్, యన్‌సీసీ విభాగాలు వారు నిర్వహిస్తున్న ఉచిత కంటి పరీక్షల శిబిరానికి డా డి తేజేష్ వర ప్రసాద్, డా ఎ అంజలి, డా యస్ఏ అబుల్ కలామ్ అంజు ఐ కేర్, కాకినాడ వారు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో చేపట్టే వివిధ సామాజిక కార్యక్రమాలకు తమ వంతు సహాయం అందిస్తామని పేర్కొన్నారు. తమ కళాశాల ఎన్ఎస్ఎస్ మరియు యన్ సీసీ విభాగాల వారు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య బృందం 231ల మందికి పైగా విద్యార్థులకు, అధ్యాపకులకు మరియు సిబ్బందికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించారని తెలియచేసారు. కళాశాల ప్రిన్సిపాల్ డా జి.నరేష్ పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి రాజశేఖర్ ఫణీంద్ర, యన్‌సీసీ ప్రోగ్రామ్ ఆఫీసర్ కెవి గణేష్‌లు ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్‌లుగా మరియు కళాశాల విద్యార్థి కో ఆర్డినేటర్‌లుగా వ్యవహరించారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చర్యలు

పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి

విశాలాంధ్ర - పెద్దాపురం : దీపావళి మందు గుండు సామాగ్రి ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని పెద్దాపురం ఆర్డీఓ కె శ్రీ రమణి హెచ్చరించారు. స్థానిక మందుగుండు దుకాణ సముదయాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఆర్డీఓ శ్రీరమణి మాట్లాడుతూ ప్రజలందరూ అహ్లాదకరమైన వాతావరణంలో దీపావళి పర్వదినాన్ని సంతోషంగా జరుపుకునేలాగ దీపావళి బాణసంచా తయారీ దారులు, విక్రయదారులు సహకరించాలన్నారు. గత ఏడాది కంటే దీపావళి సామాగ్రి తాత్కాలిక విక్రయదారులకు నిబంధనలను కఠినతరం చేసిందని, ప్రభుత్వం నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, నిరంతరం నిఘా ఉంచినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్ వెంకట లక్ష్మీ, ఎస్సై వి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం

వైఎస్సార్‌సీపీ అనపర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్ సత్తి

విశాలాంధ్ర - పెదపూడి : నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలతో పాటు వైద్య విద్యను అభ్యసించాలనుకునే వారికి మేలు చేసేలా ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం దుర్మార్గమైన చర్య అని వైఎస్సార్‌సీపీ అనపర్తి నియోజకవర్గం కోర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మండిపడ్డారు. జి మామిడాడలో శుక్రవారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణను వెంటనే నిలుపుదల చేసి ప్రభుత్వమే వాటిని నిర్వహించాలని డిమాండ్తో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆరోగ్యశ్రీ, 108, 104 వాహనాలు ప్రవేశపెట్టి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించారని కొనియాడారు. అలాగే స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో కేవలం 12 మెడికల్ కాలేజీలు ఉండగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒక్కసారిగా 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కాలేజీల నిర్మాణంలో భాగంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయాంలోనే 5 కాలేజీలను పూర్తి చేశారన్నారు. మిగిలిన 12 కాలేజీలు అందుబాటులోకి వస్తే వేలాది మంది పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసిస్తారన్నారు. ఈ కోటి సంతకాల సేకరణ పూర్తయిన అనంతరం ఆ పత్రాలను గవర్నర్కు అందచేస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, గ్రామ సర్పంచ్ లంక మున్ని, పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి నాగుమళ్ల వీరభద్రరావు, మండల కన్వీనర్ గుత్తుల రమణ, పార్టీ నియోజకవర్గం ఎస్సీసెల్ కన్వీనర్ సాంబత్తుల చంటి, నందిక ప్రమీల, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, గ్రామ కన్వీనర్ మేడపాటి తాతారెడ్డి, కో కన్వీనర్ ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు కర్రి వీరెడ్డి, కర్రి శ్రీవెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలుడుని కిడ్నాప్ చేసిన మహిళ అరెస్ట్

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు సంవత్సరాలు వయసు కలిగిన దేవర నాని కిడ్నాప్‌కు గురి కావడంతో పోలీసులు వెంటనే స్పందించి కిడ్నాప్ చేసిన కేతినేని దేవి అనే మహిళను అరెస్టు చేసి ఆ బాలుడు తల్లిదండ్రులకు సామర్లకోట పోలీసులు అప్పగించారు. వివరాల్లోకెళ్తే సామర్లకోట సత్య నారాయణపురం ఏడిబి రోడ్డు శివారు యాచక వృత్తి నిర్వహిస్తూ రాత్రి సమయంలో గుడారాలలో నిద్రిస్తున్న వారి వద్ద నుండి అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఐదు సంవత్సరాల వయసు గల దేవర నాని కనిపించక పోవడంతో తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనితో పోలీసులు వెంటనే స్పందించి అపహరించక పోయిన కేతినేని దేవి అనే మహిళను అరెస్ట్ చేసి ఆమె వద్ద ఉన్న బాలుడును తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా సామర్లకోట పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పెద్దాపురం డిఎస్పి శ్రీహరి రాజు సిఐ కృష్ణ భగవాన్‌లు మాట్లాడుతూ గతంలో రెండు దొంగతనాల్లో కేతినేని దేవిని అరెస్ట్ చేసి జైలుకు పంపించినట్టు తెలియజేశారు. బాలుడిని పెంచు కునేందుకు అపహరించినట్లు సదర మహిళ తెలియజేసిందని పోలీసులు తెలిపారు.

గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ వసతి గృహం తనిఖీ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పాండవులపాలెం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ వసతి గృహాన్ని ప్రత్తిపాడు నియోజవర్గ ప్రత్యేక అధికారి, డిప్యూటీ కలెక్టర్ ఎ శ్రీనివాసరావు, ప్రత్తిపాడు తహశీల్దార్ సూర్యప్రభతో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు. గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ వసతి గృహం అధ్వానంగా ఉందని అధికారులు అక్కడి పరిస్థితులు చూసి షాక్ అయ్యారు. గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ వసతి గృహం విద్యార్థులు దయనీయ పరిస్థితుల మధ్య చదువుకోవాల్సిన పరిస్థితి చూసి సందర్శించిన అధికారులకు మనసు చలించి పోయిందన్నారు. వంటగది అపరిశుభ్రతతో, విద్యార్థులకు అందించే ఆహారం మెనూ ప్రకారం అందించడం లేదని, విద్యార్థులు వినియోగించే టాయిలెట్లు, మరుగుదొడ్డ, వ్యర్థాలు బయటకు వెళ్లకపోవడం, హాస్టల్ గదుల్లో కొన్ని ఫ్యాన్లు, లైట్లు పనిచేయడం లేదని హాస్టల్ వార్డెన్‌గా వ్యవహరిస్తున్న రమేష్, విద్యార్థులకు ఇవ్వాల్సిన మెనూ కోసం తనకు తెలియదంటూ పొంతనలేని సమాధానం ఇవ్వడంతో పాటు పిల్లలకి అందించే ఆహార పదార్థాలు అన్ని కాలం చెల్లిన పాడైనవి గుర్తించడం జరిగిందని సదరు అధికారులు తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులకు చర్యలు నిమిత్తం నివేదిక పంపడం జరిగిందన్నారు.

నిబంధనలు పక్కనపెట్టి! జోరుగా ఇటుక బట్టీల వ్యాపారం

విశాలాంధ్ర - రౌతులపూడి : మండల కేంద్రమైన రౌతులపూడిలో ఇటుక బట్టీలు నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడపడితే అక్కడ ఇటుక బట్టీలు కొనసాగిస్తున్నారు. కొద్దిపాటి భూమి దొరికితే చాలు ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుకల తయారీ మొదలుపెడుతున్నారు. అక్రమంగా బట్టీలు కొనసాగుతున్నా..రెవెన్యూ, మైనింగ్, విద్యుత్తు, గ్రామ పంచాయతీ అధికారులు మామూళ్ల మత్తులో అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రౌతులపూడి మండలంలో 20 బట్టీలు కొనసాగుతున్నాయి. అనుమతులు తీసుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. రౌతులపూడి మండలంలో ఇటుకల వ్యాపారం జోరుగా జరుగుతోంది.

పారిశుద్ధ్యంతో మెరుగు

విశాలాంధ్ర - పెదపూడి : గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడినప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని డిప్యూటీ ఎంపీడీవో మేడపాటి సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కాండ్రేగుల పంచాయతీ ఏరియా ఎస్సీ పేటలో తడి పొడి చెత్త విడివిడిగా ఇవ్వడం, ప్లాస్టిక్ వాడకం నిషేధం, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రై డే సందర్భంగా ఇళ్లల్లో నీటి నిల్వలు పరిశీలించి వాటి వలన దోమలు పెరిగి వ్యాధులు వ్యాపిస్తాయని ప్రజలకు అవగాహన కల్పించారు.

కూటమి ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు పెద్దపీట

విశాలాంధ్ర - పిఠాపురం : రాష్ట్రంలో ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు పెద్దపీట వేస్తూ ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దానం లాజర్ బాబు పేర్కొన్నారు. పిఠాపురంలో శుక్రవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు.

విద్యార్థులందరూ క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - సామర్లకోట : ప్రభుత్వం పాఠశాలలో క్రీడలు అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటుందని, ముఖ్యంగా పీఎంశ్రీ పాఠశాల అభివృద్ధికి ఎంతగానో తోడ్పాటు అందిస్తుందని దాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతిసాధించాలని స్థానిక వార్డ్ కౌన్సిలర్ బలుసు శ్రీనివాసు, ఎంఈఓలు వై.శివ రామకృష్ణయ్య, పి.పుల్లయ్యలు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక పీఎంశ్రీ బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో పీఎంశ్రీ నిధుల నుండి ఏర్పాటు చేసిన మినీ జిమ్‌ను నెట్ బాల్ కోర్టులను ముఖ్య అతిధుల చేతుల మీదుగా ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో మినీ జిమ్‌ను కౌన్సిలర్ బలుసు శ్రీనివాసు ప్రారంభించగా, స్పోర్ట్స్ మెటీరియల్ రూమ్‌ను ఎస్ఎంసి చైర్మన్ అక్కిన చక్రధర్, నెట్ బాల్ కోర్టును కూటమినాయకులు జనసేనతరపున సరోజ వాసు, అడబాల కుమారస్వామిలు ప్రారంభించారు.

బాల బాలాజీ సన్నిధిలో శాంతి కల్యాణం

విశాలాంధ్ర - మామిడికుదురు : అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వారి సన్నిధిలో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన పవిత్రోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో గుడివాడకు చెందిన త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజియర్ స్వామి వారి శిష్య బృందం చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చక స్వాముల అధ్వర్యంలో పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మూడవ రోజు స్వామి వారికి, ఉభయ దేవేరులకు అలంకరించిన పవిత్రాలను తీసుకు వచ్చిన చక్ర పెరుమాళ్లకు సమర్పించారు. శ్రీవారికి ఏకాదశ ఫలరసాలతో అర్చన వేడుకగా జరిగింది. చతుస్థానార్చనలతో ఉత్సవాలను ప్రారంభించి శ్రీపుష్పయాగంతో ముగించారు. 108 కలశాలతో స్వామి, అమ్మవార్లకు శత కలశ స్నపన తిరు మంజన సేవ ఘనంగా నిర్వహించారు.

ప్రకటన

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, పల్లంకుర్రు గ్రామం, డోర్ నెంబర్ 7-96, గొల్ల గరువు నివాసులైన **సమనస సీత భర్త నాయుడు** వ్రాయించి ఇచ్చిన ప్రకటన. నా భర్త సమనస **నాయుడు, తండ్రి సుబ్బారావు** డోర్ నెంబర్ 7-96, గొల్లగరువు, పల్లంకుర్రు గ్రామంలో మా ఇంటి వద్ద **ది.06/05/2024**న మరణించాడు. వీరి మరణం ప్రభుత్వ రికార్డులలో నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల **10 రోజులలో** తెలియజేయగలరు.

సమనస సీత, భర్త నాయుడు
గొల్ల గరువు, పల్లంకుర్రు,
కాట్రేనికోన మండలం, సెల్: 7569687595

అపరిశుభ్రంగా ఏరియా ఆసుపత్రి

వేతనాలు విడుదల చేసేంతవరకు విధులు బహిష్కరిస్తామంటున్న పారిశుద్ధ్య కార్మికులు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: బకాయిపడ్డ నాలుగు నెలల వేతనాలు విడుదల చేసేంతవరకు విధులు బహిష్కరిస్తామని జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ శానిటేషన్ కార్మికులు ఆందో

ళన చేపట్టడంతో ఏరియా హాస్పిటల్ అపరిశుభ్రతతో దర్శనమిస్తున్నది. జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ శానిటరీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ కాంటాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ ఎదుట ధర్నా నిర్వహించి విధులు బహిష్కరిస్తున్నారు. దీంతో హాస్పిటల్‌లో ఎక్కడ చెత్తాచెదారం అక్కడే ఉండటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. అసలకే మాయదారి రోగాలతో దవాఖానకు వస్తే ఇక్కడ అపరిశుభ్రత రోగులను మరింత కుంగతీస్తుందని పలువురు వాపోతున్నారు. శుక్రవారం కూడా శానిటేషన్ కార్మికులు విధులు బహిష్కరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం గౌరవాధ్యక్షులు జంపన వెంకటరమణ రాజు మాట్లాడుతూ ఏరియా హాస్పిటల్ శానిటరీ వర్కర్స్‌కు గత నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, దీంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.

జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ శానిటరీ వర్కర్స్‌కు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించా లని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటి యుసి నాయకులు వేముల రాజు, మేరీ, చంద్రకళ, దయామని, జె.దుర్గారావు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్వార్థ ప్రయోజనాలకు నిజాయితీ అధికారి బలిపశువు

తహసీల్దారుకు మద్దతుగా దళిత సంఘాల నిరాహార దీక్షలు

విశాలాంధ్ర - అమలాపురం : దళితుడైతే తహసీల్దారు లాంటి ఉన్నత ఉద్యోగం చేయకూడదా సంపన్నులకు అడుగులకు మడుగులొత్తాల్సిందేనా.. లేకుంటే ఏసీబీ కేసుల్లో ఇరికించేస్తారా! అవును నిజమే అంటున్నారు అమలాపురం వాసులు. సమాజం విస్తుపోయేలా కొందరు ప్రబుద్ధులు అమలాపురం తహసీల్దార్‌ను ఏసీబీ కుట్ర కేసులో ఇరికించారని అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులు బాహాటంగా బల్లగుద్ది చెప్తున్నారు. తహసీల్దార్‌ను కుట్ర చేసి ఇరికించారని పలు సామాజిక వర్గాలు నిరాహారదక్షలు చేస్తున్నాయి. అశోక్ ప్రసాద్ ఏసీబీ కేసును నిజాయితీగల అధికారితో విచారిస్తే నిజాలు బయటపడతాయి అంటున్నారు. లంచం అడక్కుండా డబ్బు ముట్టకుండా 50,000 తీసుకున్నట్టు కెమికల్ పూసిన నోట్లను ముట్టుకున్నట్టు చేతులు కడిగించకుండా ఫిర్యాదు దారు చెప్పిన విధంగా అధికారులు మంచి భవిషత్తు వున్న తహసీల్దార్ అశోక్ ప్రసాద్‌ను బలిపశువుని చేశారని పలువురు విమర్శిస్తున్నారు. సాక్షాత్తు జిల్లా కలెక్టర్‌కు నడిపూడి పంచాయతీ జై భీమ్ నగర్‌కు చెందిన ఆక్రమణ రహదారి గురించి కొంతమంది దరఖాస్తు చేశారు. వీటిపై విచారించి నివేదిక ఇవ్వాల్సిందిగా కలెక్టర్ ఫైల్‌ను తహసీల్దార్ అశోక్ ప్రసాద్‌కు పంపారు. ఫైల్ పరిశీలించిన తహసీల్దార్‌కు ఫిర్యాదుదారు గంధం దుర్గా కొండలరావుకు చెందిన భూమి రికార్డు కనిపించలేదు. తొమ్మిదేళ్ల ప్రజా వినియోగంలో ఉన్న రహదారికి రికార్డులు ఉంటే ఎలాంటి అభ్యంతరాలు లేకుంటే దానిని రహదారిగా గుర్తిస్తారు. ఫిర్యాదుదారు గంధం దుర్గా కొండలరావును రికార్డు తెస్తే ఫైలు క్లియర్ చేస్తానని తహసీల్దార్ అశోక్ ప్రసాద్ స్పష్టం చేయడంతో ఫిర్యాదు దారు రికార్డు తేకుండా అనేక విధాలుగా ప్రలోభాలకు గురి చేసినట్టు తెలుస్తుంది. ఒక దశలో నా పని చేయకపోతే నువ్వు ఉద్యోగం ఎలా చేస్తావో చూస్తాను అని ఫిర్యాదు దారు గంధం దుర్గా కొండలరావు తహసీల్దార్ అశోక్‌ను. బెదిరించాడు. దీనిలో భాగంగా తహసీల్దార్ బిజీగా పని చేసుకుంటున్న సమయంలో అదే కార్యాలయంలోనే పనిచేస్తున్న తన బంధువు డేటా ఎంట్రీ ఆపరేటర్ రాము సహకారంతో రూ.50,000 నగదు తెచ్చి తహసీల్దార్ టేబుల్ మీద పెట్టి తహసీల్దార్ ముట్టినట్టు నమ్మించాడని, ఆ నగదును చూసి నిర్ఘాంతపోయిన తహసీల్దారు అశోక్ నగదును ముట్టుకోకుండా దూరంగా జరిగిపోయాడని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. నిజాయితీగా పనిచేస్తున్న అధికారిని తన అక్రమ పని చేయలేదని తప్పుడు మార్గాల్లో ఏసీబీకి పట్టివ్వడాన్ని రెవెన్యూ వర్గాలు మండి పడుతున్నాయి. ఇలా అయితే తాము ఉద్యోగాలు చేసేది ఎలా అంటూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఒక మంచి అధికారిని బలుపశువుని చేయాలని చూస్తున్నారని దళిత సంఘాలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేస్తున్నాయి.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శాశ్వత తరగతి గదులు నిర్మించాలి

ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు డి. శివకుమార్

విశాలాంధ్ర -ఏలూరు: స్థానిక కోట దిబ్బ వద్ద గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శాశ్వతమైన తరగతి గదులు నిర్మించడానికి రూ.12.6 కోట్లు తక్షణమే అధికారులు మంజూరు చెయ్యాలని ఏఐ ఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు డి. శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈనెల

22 నుండి నవంబర్ 12 వరకు జరగబోయే ఏఐఎస్ఎఫ్ బస్సు యాత్ర జరుగుతున్న సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలిసి బస్సు యాత్ర గోడ పత్రికలను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులు చదువుకోవడానికి నేటికి కూడా తరగతి గదులు లేకపోవడంతో చెట్ల కింద కూర్చొని చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఏలూరు నాయకులు సిద్దు, కృష్ణ, మేఘన,కీర్తన, సుభాష్,మహేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

అమలాపురంలో ఫైర్ పండుగ

వరుసగా దండుకుంటున్న అగ్నిమాపక అధికారులు

విశాలాంధ్ర - అమలాపురం : దీపావళి వస్తుందంటే అందరికీ పండగే. అంబేద్కర్ కోనసీమలో దీపావళి పండుగ అంటే అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది ఇంకా పెద్ద పండుగ చేసుకుంటున్నారు. బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసే వారి నుంచి మామూళ్ళు ఓ రేంజ్‌లో వసూలు చేస్తున్నారు. ఫైర్ పర్మిషన్ అంటూ బాణాసంచా దుకాణాల నుంచి అధికారులు భారీగా వసూలు చేస్తున్నారు. గ్రూపులుగా విడిపోయి గ్రామాలు మారుమూల ప్రాంతాల్లో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసే సాదాసీదా వ్యాపారుల నుండి కూడా వేలకు వేలు దండుకుంటున్నారు. అంబేద్కర్ కోనసీమజిల్లా అమలాపురంలో జీఎంసి బాలయోగి స్టేడియంలో బాణాసంచా దుకాణాలకు అధికారులు అనుమతిచ్చారు. నిత్యం బిల్డింగులు, అపార్ట్మెంట్లు, రెస్టారెంట్లు కట్టుకునే వ్యాపారులను ఫైర్ పర్మిషన్ అంటూ రాచి రంపాన పెట్టి లక్షలు వసూలు చేసి అధికారులు దీపావళి పండగ పూట బాణాసంచా షాపులనుంచి మామూళ్ల కోసం వేధిస్తున్నారని వ్యాపారులు లబోదిబోమంటున్నారు.

వారసత్వ సాంప్రదాయాలు కాపాడాలి : ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

విశాలాంధ్ర-తణుకు: వారసత్వ సంప్రదాయాలపై అవగాహన పెంచుకొని వాటిని కాపాడవలసిన బాధ్యత నేటి యువ తరం మీద ఉందని శాసన మండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ అన్నారు. ఎస్కెఎస్‌డి మహిళా కళాశాలలో నిర్వహించిన యువజన ఉత్సవాలలో పాల్గొని గెలుపొందిన యువతకు బహుమతి

ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఇలాంటి యువజన ఉత్సవాలు యువతలో ఆత్మ విశ్వాసాన్ని నింపి నైపుణ్యాలు పెంపొందించడం కోసం ఉపయోగపడతాయని అన్నారు. పోటీలలో పాల్గొన్న విజేతలకు రవీంద్రనాథ్ మెమెంటోలు, సర్టిఫికెట్స్ బహుకరించారు. సెట్విన్ సీఈఓ ప్రభాకర్, యువజన సర్వీస్ ఆఫీసర్ గట్టి ప్రవీణ్ కుమార్ , కళాశాల ప్రిన్సిపాల్ , తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు పోటెత్తిన అర్జీదారులు

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు శుక్రవారం అర్జీదారులు పోటెత్తారు. సామర్లకోట మండలం కొప్పవరం గ్రామంలోని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయంలో శుక్రవారం జరిగిన 26వ

ప్రజా దర్బార్‌లో ఉద్యోగ-ఉపాధి అవకాశాలు, ఇల్లు స్థలాలు, డ్రైనేజీ నిర్మాణం, సీఎం రిలీఫ్ ఫండ్, వైద్య సహాయం, బియ్యం కార్డు మంజూరు, కార్డుల్లో పేరు మార్పులు-చేర్పులు, పింఛన్లు, వంటి అంశాలపై మొత్తం 29 వినతులు అందాయి. వాటిలో పలు సమస్యలు వెంటనే పరిష్కరించగా, మిగతావి సంబంధిత అధికారులకు పంపి త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు ప్రారంభించామని కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణ్ మూర్తి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా వినిపించి, వెంటనే పరిష్కారం పొందుతున్నారని, ముఖ్యంగా నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాల కోసం పెద్ద సంఖ్యలో అర్జీలు సమర్పిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, ఆనంద్ న్యూటన్, చింతపల్లి అర్జున్, శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ చెప్పుడి వెంకటేశ్వరరావు, డిఆర్‌యుసిసి సభ్యుడు ముత్యాల అనిల్, నాయకులు జున్నూరు బాబ్జి, సిరియాల కొండబాబు, ఐటీడీపీ పాలికా సతీష్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు గాలికి...కాసులు జేబులోకి

- ప్రజల ప్రాణాలతో అధికారుల చెలగాటం
- కాసులిస్తే దుకాణాలు ఎక్కడైనా ఓకే..!

విశాలాంధ్ర - వీరవాసరం: బాణసంచా దుకాణాల ఏర్పాటులో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీపావళి పండుగ సందర్భంగా గతకొన్ని సంవత్సరాలుగా బాణసంచా దుకాణాల ఏర్పాటులో అధికారుల వైఖరి పట్ల విమర్శలు ఉన్నాయి. గతంలో గ్రామ శివారున మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకుంటేనే అనుమతులు ఇచ్చేవారు. రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్ శాఖల సంయుక్త పరిశీలనతో అభ్యంతరాలు లేని విధంగా ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా బాణసంచా దుకాణాలకు అనుమతులు ఇవ్వవలసి ఉంది. వీరవాసరం, నవుదూరు, కొణితివాడ, రాయకుదురు, మత్స్యపురి గ్రామాలలో సుమారు ఇరవై వరకు బాణసంచా దుకాణాలు ప్రతీ ఏటా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ దుకాణాలన్నీ జనసంచారం ఎక్కువగా ఉండే రహదారి వెంబడి ఏర్పాటు జరుగుతుంది. వీరవాసరంలో కళ్యాణ మండపాలు, గృహాల సమీపంలో జాతీయ రహదారి పక్కనే దుకాణాలు అనుమతులు ఇచ్చేస్తున్నారు. కాసులకు కక్కుర్తి పడి నిత్యం ప్రజలు రద్దీగా ఉండే ప్రదేశంలో, నిత్యం వాహనాలు, బస్సులు ప్రయాణించే 165 జాతీయ రహదారి ప్రక్కగా నివాసాల కు కూతవేటు దూరంలో, ఆలయాలు, కళాశాలలు, కళ్యాణ మండపాలు ఉన్న ప్రదేశంలో నిబంధనలు తుంగలో తొక్కి వ్యాపారులు సూచించిన ప్రాంతాలనే అధికారులు పరిశీలించడం విమర్శలకు తావిస్తోంది. ఇదేవిధంగా మిగిలిన గ్రామాలలో జనాలు నిత్యం రాకపోకలు సాగించే రద్దీ మార్గాల వెంబడి దుకాణాల ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాణాసంచా దుకాణాలను గ్రామానికి దూరంగా ఎక్కువ ఖాళీ ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలి. అలా ఏర్పాటు చేసుకున్న చోట దుకాణానికి, దుకాణానికి మధ్యలో కనీసం మూడు మీటర్ల దూరం పాటిస్తూ తగినవిధంగా నీరు, ఇసుక అందుబాటులో ఉంచాలని నిబంధనలు ఉన్నా అవేమి అధికారులు పట్టించుకోకుండా వ్యాపారస్తులు కోరిన చోటే జనసంచారం ఎక్కువగా ఉండే రహదారి వెంబడి బాణసంచా తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకోవటానికి అధికారులు స్థలాలు పరిశీలించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికుల అభ్యంతరాలు మాకెందుకు.. మా జేబులో చిల్లర పడితే చాలు అన్నరీతిలో అధికారులు బాణసంచా దుకాణాలకు అనుమతులు ఇచ్చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. షామియానా టెంట్లు, మంటలు సులువుగా అంటుకునే పాలిథిన్ టెంట్లతో దుకాణాల పైకప్పుల ఏర్పాటు ప్రమాదాలకు సంకేతాలుగా ఉంటున్నాయి. మండలంలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు ఆయా గ్రామాలలో అనువైన మైదాన ప్రాంతాలు ఉన్నప్పటికీ ఆ ప్రాంతాలకు దుకాణాలు ఎందుకు తరలించడంలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మాకేమి ఉచితంగా అనుమతులు ఇవ్వడం లేదని, షాపుకు ఇంత చొప్పున అధికారులకు మామూళ్లు ఇస్తేనే తమకు అనుమతులు ఇస్తున్నారంటూ వ్యాపారస్తులు బాహటం గానే అంటున్నారు.